RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:23 12-7-2025 శనివారం ఎడిటర్ :మర్రి పవీణ్ పేజీలు : 8 వెల 4 /-

## ప్రపంచంలో జనన రేటు పడిపోతోంది: సీఎం చంద్రబాబు



అమరావతిజులై 11(టుడే విదుర): భారతదేశానికి బలమైన ఆర్థిక వనరు జనాభానే అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. 'దేశమంటే మట్టి కాదోయ్.. దేశం అంటే మనుషులోయ్' అని గురజాడ అప్పారావు చెప్పారని ముఖ్యమంత్రి గుర్తుచేసుకున్నారు. ఆయన స్ఫూర్తిని అర్ధం చేసుకుని మనం ముందుకెళ్లాలని సూచించారు.ఏపీ సచివాలయంలో ఇవాళ (జులై 11, శుక్రవారం) ప్రపంచ జనాభా దినోత్సవ సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. ఏపీలో జనాభా పెరుగుదలపై ఫోకస్ చేశామని చెప్పుకొచ్చారు. గతంలో ఇద్దరు పిల్లల కంటే.. ఎక్కువ మంది ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలు లేదనే చట్టం తెచ్చానని గుర్తుచేశారు. ఈరోజు తానే జనాభా పెరుగుదలను సమర్థిస్తానని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు జనాభా ఎక్కువ ఉన్న దేశాలను చులకనగా చూసేవారని చెప్పుకొచ్చారు సీఎం చంద్రబాబు.ఇప్పుడు ఏ దేశంలో జనం ఉంటే వారికే ఎక్కువ గౌరవం దక్కుతోందని సీఎం చంద్రబాబు అభివర్ణించారు. ప్రపంచంలో ఎక్కువ జనాభా ఉన్న దేశం భారతదేశమని.. మన దేశంలో సుమారు 143 కోట్లమంది ఉండగా.. చైనా జనాభా 130 కోట్లని తెలిపారు. ప్రపంచంలో పాపులేషన్ పడిపోతోందని పేర్కొన్నారు. అమెరికాలో ఫెర్టీలిటీ రేటు 1.62 మాత్రమేనని 2.1 ఫెర్టీలిటీ రేటు ఉంటే రీప్లేస్‌మెంట్ ఉంటుందని లేనిపక్షంలో రోజురోజుకూ జనాభా తగ్గిపోతుందని తెలిపారు. మన దేశంలో బిహార్ 3.0, మేఘాలయ 2.9, వంటి రాష్ట్రాల్లో ఎక్కువ ఫెర్టీలిటీ రేటు ఉందని తెలిపారు. అలాగే ఏపీలో అది 1.7కి చేరుకుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

## భాషల పేరిట అడ్డుగోడలొద్దు పవన్ కల్యాణ్

- భాష నేర్చుకోవడానికి ఆటంకాలు దేనికి
- మరో భాషను అంగీకరించడం ఓటమి కాదు
- రాజ్యభాష స్వర్ణోత్సవాల్లో ఉపముఖ్యమంత్రి పవన్

జులై 11(టుడే విదుర)ఐటీ రంగంలో విజయం సాధించడానికి ఆంగ్లం ఎంత ముఖ్యమో, దేశంలో ఎక్కువ మంది మాట్లాడే హిందీ నేర్చుకోవడం వల్ల కూడా అంతే ప్రయోజనం ఉంటుందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో ఏర్పాటు చేసిన రాజ్య భాషా విభాగ స్వర్ణోత్సవ వేడుకల్లో ప్రసంగిస్తూ.. దక్షిణ భారతీయ సినిమాల్లో 31 శాతం హిందీ డబ్బింగ్ ద్వారానే ఆదాయం వస్తుందని గుర్తు చేశారు. వ్యాపారానికి హిందీ అవసరమైనప్పుడు, నేర్చుకోవడానికి వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు.భాష నేర్చుకోవడం ఓటమి కాదు..తన సినిమాలో "ఏ మేరా జహా" అనే హిందీ పాట పెట్టడానికి గల కారణాన్ని వివరిస్తూ.. మాతృభాష తెలుగు అయినప్పటికీ, హిందీ దేశ భాష అని చెప్పడానికే అలా చేశానని తెలిపారు. హిందీ నేర్చుకోవడం అంటే మన ఉనికిని కోల్పోవడం కాదని,





మరింత బలపడటమని పవన్ స్పష్టం చేశారు. మరో భాషను అంగీకరించడం ఓటమి కాదని, కలిసి ప్రయాణించడమని ఉద్ఘాటించారు. అడ్డుగోడగా భావించొద్దు..విద్య, వైద్యం, వ్యాపారం, ఉపాధి వంటి రంగాల్లో భాషా అవధులు చెరిగిపోతున్న ఈ సమయంలో హిందీని వ్యతిరేకించడం రాబోయే తరాల అభివృద్ధిని అడ్డుకోవడమేనని పవన్ అభిప్రాయపడ్డారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం వంటి మాతృభాషలపై గౌరవం ఉండాలని చెబుతూనే, హిందీని పెద్దమ్మ భాషగా అభివర్ణించారు. ఇంట్లో మాట్లాడుకోవడానికి మాతృభాష ఉండగా, దేశ సరిహద్దులు దాటితే హిందీ రాజ్య భాషగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

## రాజాసింగ్ రాజీనామా లేఖకు ఆమోదించిన జేపీ నడ్డా



న్యూఢిల్లీ,జులై 11(టుడే విదుర)గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా లేఖను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆమోదించారు. ఇటీవల ఎమ్మెల్యే పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు రాజాసింగ్ ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా.. బీజేపీలో రెబల్ ఎమ్మెల్యేగా ముద్రపడ్డ రాజాసింగ్ గత కొద్దిరోజులుగా పార్టీతో అంటీముట్టనట్టు వ్యవహరిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల సమయంలో నామినేషన్ వేసేందుకు పార్టీ కార్యాలయానికి వచ్చిన తనను కొందరు అడ్డుకున్నారని.. దీంతో పార్టీ సభ్యత్వానికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఆ రాజీనామా లేఖను రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి ఇచ్చినట్లు తెలిపారు. బీజేపీ అధ్యక్షుడిగా రామచందర్ రావు నియమకంపై రాజాసింగ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రామచందర్‌రావు బీజేపీ అధ్యక్షుడిగా ప్రకటించిన వెంటనే గోషామహల్ ఎమ్మెల్యే పార్టీ సభ్యత్వానికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు గత నెల 30న కిషన్ రెడ్డికి లేఖ రాశారు. దాదాపు 15 రోజుల తర్వాత బీజేపీ జాతీయ నాయకత్వంపై దృష్టి సారించింది. అందులో భాగంగా రాజాసింగ్ రాజీనామాను బీజేపీ జాతీయ నాయకత్వం ఆమోదించింది.

## రేణుకా చౌదరికి ఖమ్మం కోర్టులో ఊరట



ఖమ్మం జిల్లా:జులై 11(టుడే విదుర) మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరికి ఖమ్మం కోర్టులో ఊరట లభించింది. రేణుకా చౌదరిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుని న్యాయస్థానం కొట్టివేసింది. 2014 సంవత్సరంలో వైరా ఎమ్మెల్యే టికెట్ తమకు (భూక్య రాంజీ సతీమణి కళావతికి లేదా ఆమె భర్తకు) ఇప్పిస్తానని రేణుకా చౌదరి మోసం చేశారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు న్యాయస్థానాన్ని కళావతి ఆశ్రయించారు. ఈ కేసుపై ఖమ్మం జిల్లా కోర్టులోని ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానంలో విచారణ కొనసాగింది. నేరం రుజువు కాకపోవడంతో ఇవాళ (జులై11, శుక్రవారం) కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. రేణుకా చౌదరి తరఫున సీనియర్ న్యాయవాదులు ఎం.నిరంజన్ రెడ్డి, మద్ది శ్రీనివాస్ రెడ్డి ఈ కేసుని వాదించారు.జిల్లా కోర్టు వద్ద నుంచి భారీ ర్యాలీతో జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి రేణుకా చౌదరి చేరుకున్నారు. ఆమెకి అనుచరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రేణుకా చౌదరి మాట్లాడారు. తన 62సంవత్సరాల రాజకీయ జీవితంలో ఈ కోర్టు కేసు మొదటిదని చెప్పుకొచ్చారు. నిజం అనేది ఎప్పటికైనా నిరూపితం అవుతుందని అన్నారు. నాలుగు రోజుల్లో తన గేమ్ స్టార్ట్ చేస్తానని.. ఒక్కొక్కరిని అటాడిస్తానని హెచ్చరించారు. అసలు తనపై ఈ కేసు వేయించిన వారు ఎవరో.. వారి సంగతి చెబుతానని వార్నింగ్ ఇచ్చారు రేణుకా చౌదరి.

## విచారణకు రాలేను . సిట్ కు మాజీ ఐఎఎస్ రజత్ భార్గవ్ లేఖ



విజయవాడజులై 11(టుడే విదుర) తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపుతున్న ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఎక్సైజ్ శాఖలో కీలక స్థానంలో పనిచేసిన రిటైర్డ్ అధికారి డాక్టర్ రజత్ భార్గవక విజయవాడలోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఆ నోటీసుల్లో సిట్ స్పష్టం చేసింది. అయితే, నేటి విచారణకు డాక్టర్ రజత్ భార్గవ హాజరు కావడం లేదు. ఈ విషయాన్ని ఆయన సిట్ అధికారులకు తెలియజేశారు. శుక్రవారం విచారణకు రాలేనని, వచ్చే వారం హాజరవుతానని సిట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. తన ఆరోగ్యం బాగోలేదని, చికిత్స పొందుతున్నానని, విచారణకు హాజరయ్యేందుకు తగిన సమయం ఇవ్వాలని కోరారు. అయితే, సిట్ అధికార వర్గాలు మాత్రం ఆయన విచారణకు హాజరవుతారని భావిస్తున్నాయి

## టీటీడీలో ఆ ఉద్యోగులను తక్షణమే తొలగించాలి.. బండి సంజయ్

తిరుమల, జులై 11(టుడే విదుర)కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీనివాసుడిని కేంద్రమంత్రి బండి సంజయ్ ఈరోజు (శుక్రవారం) దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రికి ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. దర్శనానంతరం కేంద్రమంత్రి బండి సంజయ్ ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీలో 1000 మందికి పైగా అన్యమతస్థులు పని చేస్తున్నారని తెలిపారు. టీటీడీలో పని చేస్తున్న అన్యమత ఉద్యోగులకు హిందూ సనాతన ధర్మంపై విశ్వాసం లేదన్నారు. టీటీడీ పాలకమండలి వెంటనే స్పందించి వారందరినీ తొలగించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఓ ఉద్యోగిని తొలగించడంపై స్పందించిన కేంద్రమంత్రి.. ఒకరిని తొలగిస్తే సరిపోదని, టీటీడీలోని అన్యమత ఉద్యోగస్థులందరినీ గుర్తించి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అన్యమస్థులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ధూప దీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాలతోపాటు పురాతన ఆలయాలను టీటీడీ అభివృద్ధి చేయాలని సూచించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఇల్లెందు రామాలయం, కొండగట్టు ఆంజనేయ స్వామి, వేములవాడ ఆలయాల అభివృద్ధికి టీటీడీ సహకారం అందించాలని కేంద్రమంత్రి కోరారు. శ్రీవారి సేవలో నిజమైన భక్తి, నిబద్ధతతో పనిచేసే వారికే అవకాశం





కల్పించాలంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

# సంపాదకీయం

## పేదరిక నిర్మూలనకే పీ4

సమూలంగా, శాశ్వతంగా పేదరికం నిర్మూలించాలనే బలమైన లక్ష్యంతో పీ4 విధానానికి రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసింది. ఇప్పటికే ఈ విధానం ద్వారా 87 వేల కుటుంబాలను బంగారు కుటుంబాలుగా దత్తత తీసుకొని, అభివృద్ధి చేసి పేదరికం నుంచి బయటపడేసేలా కృషి చేస్తోంది. %యావత్ ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న భూతం పేదరికం. ఈ భూమి మీద పేదరికాన్ని నిర్మూలించిన దేశం లేదు. కానీ పేదరికం తగ్గించేందుకు ప్రపంచంలోని అన్ని దేశాలు కృషి చేస్తున్నాయి. పేదరిక నిర్మూలనకు భారతదేశంలో గత 75 ఏళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను రూపొందించినా, ఇంకా పేదరికం తాండవిస్తూనే ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో సుమారుగా 50 లక్షల కుటుంబాలు పేదరికంలో ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే... పేదరికం ప్రధాన సమస్యగా ఉందని గ్రహించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దానిని సమూలంగా రూపుమాపే కార్యక్రమం రూపొందించాలని నిర్ణయించుకున్నారు. 2047 నాటికి దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను ఉన్నత స్థానంలో నిలిపేలా విజన్ 2047 డాక్యుమెంట్‌కు రూపకల్పన చేశారు. ఇందులో భాగంగా మొట్టమొదటగా పబ్లిక్%-%ప్రైవేట్%-%పీపుల్%-%పార్టనర్‌షిప్(పీ4)పై చంద్రబాబు తన ఆలోచన విధానాన్ని వివరించారు. 2029 నాటికి రాష్ట్రంలో ఉన్న నిరుపేద కుటుంబాలను అభివృద్ధి వైపు నడిపించి పేదరికం లేకుండా చేయాలన్నది ఆయన సంకల్పం. ఆ సంకల్పంతో పుట్టిందే పీ4. తెలుగు వారి పర్వదినం ఉగాది పండుగ నాడు ఈ మహోన్నత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఐక్యరాజ్యసమితి పేదరికం నిర్మూలన కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. ప్రపంచంలో పేదరికం లేని దేశాలు లేవు. కానీ కొన్ని దేశాలు పేదరికాన్ని చాలా తక్కువ స్థాయికి తగ్గించగలిగాయి. ఐస్‌లాండ్, నార్వే, డెన్మార్క్, స్విట్జర్లాండ్ వంటి దేశాలు పేదరికం తక్కువగా ఉన్న దేశాలు. ఏం చేస్తే పేదరికాన్ని రూపుమాపొచ్చనే అంశాలను ఐక్యరాజ్యసమితి రూపొందించింది. స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించిందే పేదరికాన్ని ఆంధ్రప్రదేశ్ నుంచి రూపుమాపాలన్న ఒక మహోన్నతమైన ఆలోచనతో. పేదవాడికి కూడు, గూడు, బట్ట అందించాలన్న ఎజెండాతో ఆయన ముందుకెళ్లారు. పేదలకు రెండు రూపాయలకే కిలో బియ్యం, పింఛన్లు, జనతా వస్త్రాలు వంటి కార్యక్రమాలు అమలు చేశారు. అన్నగారి ఆశయాలను కొనసాగిస్తూనే చంద్రబాబు జన్మభూమి కార్యక్రమం పేరుతో గ్రామీణ, పట్టణ రూపురేఖలనే మార్చేశారు. స్థానిక ప్రజల సమన్వయంతో గ్రామీణ ప్రాంతాల్లో జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగులను గ్రామాల్లోకి పంపి, ప్రజల సమస్యలను నేరుగా వినడం, వాటిని పరిష్కరించడం కోసం 'ప్రజల వద్దకు పాలన' కార్యక్రమాన్ని నిర్వహించారు. విజన్ 2020ని ప్రవేశపెట్టి 2020 నాటికి రాష్ట్రంలో పేదరికాన్ని రూపుమాపేందుకు కృషి చేసేలా ప్రణాళికలు రచించారు. మహిళలను స్వయం సహాయక బృందాలతో ఏకీకృతం చేసి, సూక్ష్మ రుణాలు అందజేయడం ద్వారా చిన్న తరహా వ్యాపారాలను ప్రోత్సహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని బలోపేతం చేయడం, రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. నిరుపేద కుటుంబాలకు నేరుగా ఆర్థిక సాయం, గృహ నిర్మాణం కోసం రాయితీలు, ఆహార భద్రత కోసం రేషన్ వ్యవస్థను బలోపేతం చేశారు. జన్మభూమి, నీరు%-%మీరు, స్వయం సహాయక బృందాలు, రైతు బజార్ వ్యవస్థ ఏర్పాటు వంటి కార్యక్రమాలతో రాష్ట్రంలో పేదరికం నుంచి బయటపడ్డ కుటుంబాలు, గ్రామాలు అనేకం ఉన్నాయి.దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పూర్తిగా పేదరికాన్ని రూపుమాపే కార్యక్రమాలు ఒక్కటీ అమలు చేయడం లేదు. కానీ ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే సమూలంగా, శాశ్వతంగా పేదరికాన్ని నిర్మూలించాలనే బలమైన లక్ష్యంతో పీ4 విధానానికి రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసింది. ఇప్పటికే ఈ విధానం ద్వారా 87 వేల కుటుంబాలను బంగారు కుటుంబాలుగా దత్తత తీసుకొని, అభివృద్ధి చేసి పేదరికం నుంచి బయటపడేసేలా కృషి చేస్తోంది. పీ4 విధానంలో భాగంగా తెలుగు ప్రవాసీయులు, హై%-%నెట్‌వర్త్ వ్యక్తులు 10 శాతం మంది సహకారంతో ఆదాయం తక్కువగా ఉన్న 20 శాతం వర్గాలను ఎంపిక చేసి ఆర్థికంగా అభివృద్ధి చేయడం. ఇళ్ల నిర్మాణం, పరిశుభ్రమైన వనరులు, తాగునీరు, పారిశుధ్యం, డిజిటల్ కనెక్టివిటీ, సౌర విద్యుత్ వంటి సౌకర్యాలు పేదరికంలో ఉన్న కుటుంబాలకు అందించడం, వారిలో నైపుణ్యాలను పెంపొందించేలా నాయకత్వ శిక్షణ ఇవ్వడంతో పాటు స్థానికంగా కమ్యూనిటీ సహకారం అందించే లక్ష్యంతో పీ4 విధానం అమలవుతుంది. ప్రతి కుటుంబాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి, విద్యుత్, వంట గ్యాస్, ఆరోగ్య బీమా కవరేజ్, మరుగుదొడ్లు, మురుగు కాల్వల సదుపాయాలు వంటి ప్రాథమిక సేవలు అందించేందుకు 'కుటుంబానికో వ్యాపారి' అనే లక్ష్యంతో ప్రతి ఇంటి ఆర్థిక స్వావలంబనకు పీ4 మార్గం చూపించనుంది. రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి నియోజకవర్గంలో 10 వేల పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా అధికారులు ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్లో ఎలాంటి కోత ఉండదు. పేదలు, ధనికుల మధ్య అంతరాలు తగ్గించేందుకే ఈ పీ4 విధానం అమలు చేస్తున్నారు.

# స్మార్ట్..మీ డర్!



**స్మార్ట్ మీటర్ల గందరగోళం**

**గృహాలకు ప్రభుత్వ అనుమతి లేదు**

**బిగించిన వాటికి 2 శాతం అదనపు బిల్లు**

(రాజమహేంద్రవరం జులై 11(టుడే విదుర):విద్యుత్ వినియోగదారులు స్మార్ట్ మీటర్ల షాక్ కొడతాయని ఆందోళన చెందుతున్నారు. స్మార్ట్ మీటర్లు వద్దంటూ మొండికేస్తున్నారు. ఈ మీటర్ల మార్పు వివాదాస్పదమైంది. స్మార్ట్ మీటర్లను మార్చుకోవచ్చుని చెప్పడానికి ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం. అయినా ఇంత వరకూ గృహ వినియోగానికి సంబం ?ధించి స్మార్ట్ మీటర్ల విషయంలో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. స్మార్ట్ మీట ర్లపై గత వైసీపీ ప్రభుత్వంలోనే ఆదానీ గ్రూప్‌తో ఒప్పందం కుదుర్చున్న సంగతి తెలిసి ందే. ఈ మీటర్లు బిగిస్తే ఎక్కువ బిల్లు వస్తుం దని..ఈ విధానంలో రీచార్జి ఆప్షన్ ఉ ండడం వల్ల బిల్లులు విధానం ఉండదని.. ముందుగా డబ్బు చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా అవుతుందనే ప్రచారం విస్తృతంగా సాగుతోంది. ఈ నేప?థ్యం లో గృహ వినియోగానికి సంబం?ధించి ఇంత వరకూ స్మార్ట్ మీటర్ల బిగింపు విషయంలో ఏ విధమైన నిర్ణయమూ తీసుకోలేదు. కానీ ప్రభుత్వ కార్యాలయాలు, కేటగిరీ -2కు చెందిన వాణిజ్య రంగ వినియోగదారులకు మాత్రం తప్పనిసరిగా బిగిస్తున్నారు. జిల్లాలో గ్రామ పం చాయతీలు, వీధిలైట్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ఏర్పాటు చేస్తున్నారు.జిల్లా లో మొత్తం 10,681 ప్రభుత్వ కార్యాలయాలు ఉం డగా ఇప్పటికే 9,860 మీటర్లు బిగించారు. వాణి జ్యానికి సంబంధించిన వినియోగదారులు, 500 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగించిన గృహ వినియోగదారులకు బిగించాలని గుర్తించారు. కానీ కొందరు వ్యతిరేకిస్తున్నారు. ఈ కేటగిరిలో ఒక లక్షా 40 వేల 717 మంది వినియోగదారులను గుర్తించగా ఇప్పటికే 48,115 స్మార్ట్ మీటర్లు బిగించారు. ఇందులో సుమారు 4 వేల మంది వరకూ ఎక్కువ విద్యుత్ వినియోగించే గృహ వినియో గదా రులు కూడా ఉన్నట్టు గమనార్హం. కానీ అసలు గృహాలకు మీటర్లు మార్పు విష యంలో ఇంకా ప్రభుత్వం నిర్ణయం తీసుకోక పోయినప్పటికీ.. ఓ జాబితా పట్టుకుని ఆదాని గ్రూపునకు చెం దిన ఉద్యోగులు ఇళ్లు, అపార్ట్ మెంట్లకు తిరు గుతుండడం గమనార్హం. అధికా రికంగా అయి తే విద్యుత్ శాఖకు సంబంధించిన ఉద్యోగి ఆధారాలతో వచ్చేవారని..అయినా స్మార్ట్ మీట ర్లు బిగించడానికి తాము ఒప్పుకోమని ప్రజలు తిప్పి పంపుతున్నారు. ప్రస్తుతం బిగించిన ప్రాంతాల్లో కొంత ఎక్కువ బిల్లులు వస్తుండ డం గమనార్హం. ఈ మీటర్లు బిగిస్తే 2 శాతం వరకూ పెరగవచ్చని అంచనా. స్మార్ట్ మీటరు మొబైల్ యాప్‌లో లాగిన అయితే ప్రతి అర గంటకూ ఎంత విద్యుత్ వినియోగమైందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవచ్చని..దాని వల్ల ఎంత వాడుకోవాలో తెలుసుకునే సౌలభ్యం ఉందని అధికారులు చెబుతున్నారు. స్మార్ట్‌మీటర్లు బిగిం చడానికి ఎవరూ ఒప్పుకోవద్దని వామపక్షాలు, ఇతర నాయకులు ఇప్పటికే ఆందోళన చేస్తున్నా రు. ప్రజలు కూడా సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీంతో ఈ మీటర్లు మార్చడం అనేది వివాదాస్పదమైంది.



# 'ముంపు' టెన్షన్

చింతూరు,జులై 11(టుడే విదుర):వరదల కాలం వచ్చింది. దీంతో ముంపు ప్రాంతా ల్లో టెన్షన్ ప్రారంభమైంది. నదీ పరి వాహక ప్రాంతంలో ఎడ తెరి పి లేని వర్షం కురవగా అక్కడి లో తట్టు ప్రాంతాలు మంపునకు గు రవడం సహజం. ఐతే విలీన మం డలాల పరిస్థితి అందుకు భిన్నం. మన రాష్ట్రంతో పాటు ఒడిస్సా, ఛత్తీస్‌గడ్, తెలంగాణ, మహారాష్ట్ర లో ఎడతెరిపి లేకుండా వర్షం కురి సినా, వరదలు సంభవించినా ఆ ప్రభావం ఇక్కడ పడుతుంది. ఇది ప్రతి ఏటా జరిగే తంతే. వీటికి తోడు ఇప్పుడు పోలవరం బ్యాక్ వాటర్ తోడైంది. దీంతో వర్షాకాలం వచ్చిందంటే చాలు లోతట్టు వాసులకు కంటిమీద కునుకు కరువే. శబరి, సీలేరు, గోదావరి నదుల ఉధృతే దీనం తటకీ కారణం. ప్రతి ఏటా జూలై నుంచి సెప్టెంబర్ వరకు ఇది తప్పని దుస్థితి. కొన్నేళ్లుగా జూలై లోనే గోదావరి ఉగ్రరూపం దాల్చిన సందర్భాలున్నాయి. దీంతో ఈనెల ఎట్టా ఉంటుందో నన్న ఆందోళన అలముకుంది. ఇప్పటికే భద్రాచలం వద్ద గోదావరి క్రమంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రం 3 గంటలకు భద్రాచలంలో 24.10 అడుగులకు గోదావరి చేరు కుంది. గతేడాది జూలై 27న భద్రాచలం వద్ద గోదావరి 53.6 అడుగుల గరిష్ఠ ప్రవాహం నమోదైంది. దీంతో లోతట్టు గ్రామా లు నీట మునగడమే కాకుండా రాకపోకలు నిలిచిపోయాయి.గడచిన ఆరున్నర దశాబ్దాల కాలంలో జూలై నెలలో గోదా వరి వరద ఉధృతిని పరిగణలోకి తీసుకుంటే 14 సార్లు తొలి ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించింది. అదే దశలో ఆరు పర్యాయాలు తుది ప్రమాద హెచ్చరిక (53 అడుగులు) దాటి ప్రవహించింది. వరుసగా 1972 జూలై 6న 44.3 అడుగుల నీటిమట్టం నమోదైంది. 1976 జూలై 22న 63.9 అడుగులు, 1988 జూలై 24న 56.7, 2003 జూలై 27న 45.8, 2008 జూలై 6న 47.3, 2013 జూలై 19న 47, 2016 జూలై 12న 52.4, 2022 జూలై 16న 71.3 అడుగులు, 2023 జూలై 30న 56.1, 2024 జూలై 27న 53.6 అడుగులకు చేరుకుని ప్రవహిం చింది. వీటిలో 2022 జూలై 16న రికార్డుస్థాయిలో 71.3 అడుగుల మేర గోదావరి ప్రవాహం నమోదైంది. దీంతో చింతూరు డివిజనులోని లోతట్టు గ్రామాలు ఛిద్రమయ్యాయి. ఇళ్లు కూలిపోయి బురదలో కూరుకపోయాయి. ఇక రహదారులు సరేసరి. భద్రాచలంలో గోదావరి నది 59 అడుగుల నుంచి 63 అడుగుల వరకు ప్రవ హించిన క్రమంలో చింతూరు డివిజనులోని 180 గ్రామాలపై ఆ ప్రభావం పడనుంది. ఆపై ప్రవాహం ఉంటే మునక మరింత పెరుగుతూ ఉంటుంది.

# ట్రాన్స్‌ఫార్మర్స్ రాగిదిమ్మల చోరీలు...

# దొరికిన అంతర్ జిల్లా దొంగలు

**నిందితుల వివరాలు వెల్లడిస్తున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్**

**ముఠా సభ్యులను దేవరపల్లిలో పట్టుకున్న పోలీసులు**

**%రూ.10 లక్షల విలువైన 67 రాగిదిమ్మలు, 2 కార్లు స్వాధీనం**



దేవరపల్లి,జులై 11(టుడే విదుర):: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగిదిమ్మలు దొంగిలించిన అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఇటీవల విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్స్‌లోని రాగి వైర్ల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ, కొవ్వూరు ఎస్‌డీపీవో, రాజమ హేంద్రవరం సీసీఎస్ ఆధ్వ ర్యంలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పా టు చేశారు. ఆ టీమ్‌లు సాంకే తిక పరిజ్ఞానంతో సీసీ కెమెరాల సహకారంతో నలుగురు అంత ర్ జిల్లాల దొంగలను దేవర ప ల్లి డైమండ్ జంక్షన్ వద్ద అరెస్టు చేసినట్టు తెలి పారు. వారితో పాటు రాగివైరు కొనుగోలు చేసిన ఇద్దరు వ్యా పారులను కూడా అరె స్టు చేసి నట్టు చెప్పారు. వారు తూర్పు గోదావరి, ఏలూరు జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, కాకినాడ జిల్లా, కోనసీమ జిల్లాల్లో 115 ట్రాన్స్ ఫార్మర్‌లను దొంగిలించారని, వాటి విలువ రూ. 10లక్షలు ఉంటుందని తెలిపారు. చోరీలకు పాల్పడిన పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండ లం రాయికుదురు గ్రామానికి చెందిన కడలి సతీ ష్, ఏలూరు జిల్లా కృతివెన్ను మండలం లక్ష్మీపు రం గ్రామానికి చెందిన వేండ్రపు దుర్గాశ్రీనివాస్, పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన బళ్లా విజయరత్నం, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం దెయ్యాల దిబ్బ గ్రామానికి చెందిన ఏలూరు పోసియ్యలతో పాటు పాటు చోరీ సొత్తు కొన్న పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం గొల్లవాని దిబ్బ గ్రామానికి చెందిన పావురాయిల కోటేశ్వరరావు, భీమవరం మండలం దిర్శిమర్రు గ్రామానికి చెందిన సవరపు భీమారావును అరె స్టు చేశామని పేర్కొన్నారు. వారి నుంచి రూ.10 లక్షల విలువైన 67రాగిదిమ్మలను స్వాధీనం చేసు కున్నామని, వాటి విలువ రూ.10 లక్షలు ఉంటు ందని తెలిపారు.

# కేంద్ర బృందంచే చెత్త నిర్వహణ ప్లాంట్ల పరిశీలన



తిరుపతి, జులై 11(టుడే విదుర):తిరుపతి కార్పొరేషన్ నిర్వహిస్తున్న తూకివాకం, రామాపురం చెత్త నిర్వహణ ప్లాంట్లను కేంద్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి (అమృత్ పథకం) ఇషా కాలియా, సాంకేతిక సలహాదారుడు రోహిత్ కక్కర్, రాష్ట్ర కార్యదర్శి సురేష్ కుమార్ కమిషనర్ ఎన్.మౌర్యతో కలిసి పరిశీలించారు. తూకివాకం వద్ద గల మురుగునీటి శుద్ధి కేంద్రం, తడి, పొడి చెత్త, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లను పరిశీలించారు. మురుగునీరు శుద్ధి చేసి ప్రైవేటు ఫ్యాక్టరీలకు, పంటలకు సరఫరా చేస్తున్నామని కమిషనర్ వివరించారు. రామాపురంలో చెత్త నిర్వహణతో వచ్చిన ఎరువును పొలాలకు, ప్లాస్టిక్ వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీలకు విక్రయిస్తామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ నిర్వహణపై కేంద్ర బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, మునిసిపల్ ఇంజినీర్లు తదితరులున్నారు.

# భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవ శిక్ష

బెలగాం/కొమరాడ,జులై 11(టుడే విదుర): భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవ శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానాను విధిస్తూ రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి ఎస్.దామోదరరావు తీర్పు చెప్పారని ఎస్పీ మాధవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కొమరాడ మండలం నయా గ్రామానికి చెందిన మండంగి గణపతి తన భార్య పులమమ్మను 2019న మే 26న రాత్రి 11 కత్తితో పుడిచి హత్య చేశా డు. దీనిపై అప్పట్లో కొమరాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి ఎస్ఐ ఎం.రాజేష్, పార్వతీపురం రూరల్ సీఐ జి.రాంబాబు దర్యాప్తు చేపట్టారు. కోర్టులో తగిన సాక్ష్యాధారాలు సమర్పించారు. గణప తి చేసిన నేరం రుజువు కావడంతో ఆయనకు శిక్ష విధిస్తూ న్యాయాధికా రి తీర్పు చెప్పారని ఎస్పీ వివరించారు.

# తాళంవేసిన ఇంటిని టార్గెట్ చేసిన దొంగలు

## దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఏఎస్సై శేషారెడ్డి
## బీరువా పగలకొట్టి రూ.1.10 లక్షల నగదు అపహరణ



సింగరాయకొండ, జులై 11(టుడే విదుర): తాళంవేసిన ఇంటిని దుండగులు టార్గెట్ చేశారు. ఇంటిలో ఎవరూ లేనిసమయంలో ఇంటి తలుపు తాళాలు పగలకొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాతాళం పగలకొట్టి అందులో ఉన్న రూ. 1.10 లక్షలు నగదు, రెండు జతల వెండి పట్టీలను అపహరించుకొని పోయారు. ఈ సంఘటన స్థానిక ప్రశాంతి హాలు ఎదరుగా ఉన్న బజారులో రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. సింగరాయకొండ ప్రశాంతి హాలు సెంటర్‌గా ఉన్న వీధిలో పఠాన్ రఫీ వెల్డింగ్ పనిచేస్తూ జీవనం గడపుతూ ఉంటారు. మోహరం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఈతమొక్కల బంధువుల ఇంటికి వెళ్లారు. మరలా తిరిగి పఠాన్ రఫీ సాయంత్రం ఒక్కరే ఇంటికి వచ్చారు. అనంతరం స్నానంచేసి పనిమీద బయటకు వెళ్లారు. గురువారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చారు. గేటుకు వేసిన తాళం పగలకొట్టి ఉండటంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. లోపలివెళ్లి చూడగా ఇంటితాళం, బీరువాతాళం పగలకొట్టి అందులో ఉన్న నగదు రూ. 1.10 లక్షలు, వెండి పట్టీలు దోచుకెళ్లారు. సమాచారం అందుకొన్న పోలీసులు డ్వాగ్ స్క్వాడ్, వేలిముద్రల సేకరణ బృందాలను రంగంలోకి దింపారు. పఠాన్ రఫీ ఫిర్యాదు మేరకు ఏఎస్సై శేషారెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# 14 ఆవులు మృత్యువాత



## సంఘటనా స్థలిలో ఆవుల కళేబరాలు
## జాతీయ రహదారిపై వ్యాన్ బోల్తా

దెందులూరు,జులై 11(టుడే విదుర): మండలంలోని సోమవరప్పాడు పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారిపై వ్యాన్ బోల్తా పడి 14 ఆవులు మృత్యువాత పడ్డాయి. విశాఖపట్నం నుంచి గుంటూరు పశువుల సంతకు తరలిస్తుండగా వ్యాన్ బోల్తా పడడంతో వ్యాన్‌లో ఉన్న 30 ఆవులలో 14 ఆవులు మృతి చెందాయి. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, దెందులూరు నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి వెంకట చైతన్యకృష్ణ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన పశువులను పరిశీలించారు. అనుమతి లేకుండా పశు వులను సంతకు తరలించే వారిపై కేసులు నమోదు చేయాలని, పోలీసులు నిత్యం తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. సీఐ రాజశేఖర్, ఎస్ఐ శివాజీ బీజేపీ నాయకులతో చర్చలు జరిపి అను మతి లేకుండా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటా మన్నారు. వ్యాన్ బోల్తా సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. చీకటి ప్రభుచౌదరి, శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

# చోరీ కేసులో నిందితుల అరెస్టు



గజపతినగరం,జులై 11(టుడే విదుర):స్థానిక రైల్వేస్టేషన్ కాలనీలో చోరీకి పాల్పడిన నిందితులను పట్టుకుని అరెస్టు చేశామని సీఐ జీఏవీ రమణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా గోరంట్ల గ్రామా నికి చెందిన చిల్లర సురేష్, జల్లేపల్లి వెంకటేశ్వరరావు, దాసరి సుభాష్, విజయవాడ రామలింగేశ్వర కాలనీకి చెందిన నాగవీర భాస్కరరావులు మధ్యాహ్నం రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతంలో అనుమానా స్పదంగా తిరుగుతున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. ఈ మేర కు సిబ్బంది సహాయంతో దాడి చేసి, వారిని అదుపులోకి తీసుకుని విచా రణ చేపట్టగా నేరం అంగీకరించారని చెప్పారు. ఈనెల 1వ తేదీన కారు ను అద్దెకు తీసుకుని సాలూరు మండలంలోని మక్కువ గ్రామంలో శంబర పోలమాంబ అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో సాలూరు పట్టణంలో తాళంవేసి ఉన్న ఇంటిలో చోరీకి పాల్పడ్డారని ఆయన తెలిపారు. అనంతరం తిరుగు ప్రయాణంలో గజపతినగరం రైల్వేస్టేషన్ కాలనీలో తాళంవేసి ఉన్న పాంద్రంకి పార్వతి ఇంటిలో చోరీకి పాల్పడ్డారని చెప్పారు. 200 గ్రాముల వెండి, రూ. 10వేల నగదు చోరీ జరిగినట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. నిందితుల నుంచి 200 గ్రాముల వెండితో పాటు రూ. 1150నగదు, కారును సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రాజీ కోసం మధ్యవర్తిత్వం అవసరం




గిద్దలూరు టౌన్,జులై 11(టుడే విదుర): ప్రస్తుత సమాజంలో కోర్టు కేసులు త్వరగా పరిష్కరించుకోవడం కోసం మధ్యవర్తిత్వానికి చాలా ప్రాధాన్యత ఏర్పడిందని జూనియర్ సివిల్ న్యాయాధికారి, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఏ ఓంకార్, కే భరత్‌చంద్ర అన్నారు. దేశం కోసం మధ్యవర్తిత్వం అవగాహన వారోత్సవాలలో భాగంగా స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేయగా న్యాయాధికారులు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గిద్దలూరు కోర్టుల వద్ద ముగ్గురు మధ్యవర్తులను ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ వారు నియమించినట్లు తెలిపారు. వీరు వారికి కేటాయించిన కేసుల్లో ఇరుపార్టీలకు సత్వర పరిష్కారానికి మధ్యవర్తులు చూపించాల్సిందిగా తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని మధ్యవర్తిత్వం ద్వారా తమ కోర్టు కేసులను పరిష్కరించుకోవాలన్నారు. ఈసందర్భంగా 1కే వాక్‌ను కూడా నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎన్ శేషశైనారెడ్డి, ఉపాధ్యక్షుడు బి.ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఎ.తిరుమలప్రసాద్, అసిస్టెంట్ గవర్నమెంటు ప్లీడర్ డి.సంగీతరావు, న్యాయవాదులు పిడతల రాజశేఖర్‌రెడ్డి, కె.హిమశేఖర్‌రెడ్డి, కె.పోలయ్య పాల్గొన్నారు.

# గురుకుల కళాశాల విద్యార్థిని మృతి

## ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టిన విద్యార్థిని బంధువులతో మాట్లాడుతున్న ఆర్డీవో అంబరీష్
## మృతిపై అనుమానాలు బంధువుల ఆందోళన



భీమడోలు, జులై 11(టుడే విదుర): పోలసానపల్లి బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రథ మ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందింది. కళాశాలలో మధ్యా హ్నం 3.30 గంటల వరకూ మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ అనంతరం సాయంత్రం ఈ సంఘటన చోటు చేసుకుంది. భీమడోలు శివారు అర్జావారిగూడెం గ్రామా నికి చెందిన లేళ్ల మానస (16) అప్పటి వరకు తల్లి దండ్రులు మరియమ్మ రాజుతో ఉల్లాసంగా సమావేశం లో ఉందని చెబుతున్నారు. తర్వాత కొద్దిసేపటికే మృతి చెందినట్లు తెలియడంతో తల్లిదండ్రులు జీర్ణించుకోలేక పోతున్నారు. చున్నీతో ఉరివేసుకుని మృతి చెందినట్లుగా కళాశాల అధికారులు చెబుతుండగా తల్లిదండ్రులు, బంధువులు ఖండిస్తున్నారు. పాఠశాల అధికారులు, అధ్యాపకులు ఏదో చేశారని అనుమానం వ్యక్తం చేస్తు న్నారు. మానస అపస్మారక స్థితిలో ఉండడంతో కళాశాల యాజమాన్యం మానసను భీమడోలు ప్రభుత్వ సామాజిక వైద్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.గురుకుల కళాశాల విద్యార్థిని మానస మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమతో ఉల్లాసంగా గడిపిన కుమార్తె అంతలోనే ఎలా చనిపోతుందని తల్లి దండ్రులు, బంధువులు ప్రశ్నిస్తున్నారు. మృతిపై అను మానాలు వ్యక్తం చేస్తూ తమకు న్యాయం చేయాలం టూ ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టి నినాదాలు చేశారుౌలసానపల్లి గురుకుల కళాశాలలో విద్యార్థిని మృతి సంఘటన సమాచారం తెలుసుకున్న ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐ విల్సన్, తహసీల్దార్ రమాదేవి కళాశాలను సందర్శించారు.ల

# బుసలు కొడుతున్న బుసక వ్యాపారం

- ◆ మంగినపూడి బీచ్ రోడ్డు వెంబడి టిప్పర్లతో బుసకను తరలిస్తూ...,
- ◆ బందరు నార్త్ మండలంలో యథేచ్ఛగా తవ్వకాలు
- ◆ %రెండు రోజుల కిందట అక్రమార్కుల రహస్య సమావేశం
- ◆ వైసీపీ నాయకులతో కలగలిసిన కూటమి నేతలు
- ◆ వచ్చిన సొమ్మును సమంగా పంచుకోవాలని తీర్మానం
- ◆ పగలు, రాత్రి తేడా లేకుండా తవ్వకాలు



జులై 11(టుడే విదుర):మచిలీపట్నం : బందరు నార్త్ మండలంలోని ముడా, ప్రభుత్వ భూములు 600 ఎకరాల్లో నుంచి ప్రభుత్వానికి ఒక్క రూపాయి సీనరేజీ చెల్లించకుండా బుసకను తవ్వేస్తున్నారు. వైసీపీ హయాంలో బుసకను తవ్వి విక్రయించడంలో అనుభవం ఉన్న వారితో కొందరు కూటమి నాయకులు కలిశారు. వీరంతా కలిసి ప్రభుత్వ భూముల నుంచి బుసకను తవ్వి లోడ్ చేసినందుకు టిప్పర్‌కు రూ.4,500, ట్రాక్టర్‌కు రూ.500 వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ భూములను తమ సొంతంగా భావించి ఇంత పెద్దమొత్తంలో వ్యాపారం చేస్తున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు కన్నెత్తి చూడట్లేదు. బందరు పోర్టుకు మెటీరియల్‌ను రవాణా చేసే రహదారి వెంబడి పగలు, రాత్రి తేడా లేకుండా టిప్పర్లు, ట్రాక్టర్లు తరలిపోతున్నా పట్టించుకునేవారు లేరు.చేతివాటాలపై అంతర్గత సమావేశంబుసక అక్రమ రవాణా చేసే వారంతా రెండు రోజుల క్రితం మంగినపూడి బీచ్‌కు వెళ్లే రహదారి వెంబడి ఉన్న ఓ అమ్మవారి గుడి సమీపంలో సమావేశం నిర్వహించారు. కరగ్రహారం, గోపువానిపాలెం, తపశిపూడి, మంగినపూడి ప్రాంతాల్లో ఎక్కడ బుసక తవ్వకాలు చేపట్టినా, అందరం ఒకే ధరకు విక్రయించాలని నిర్ణయించారు. లెక్కలు మాత్రం కచ్చితంగా ఉండాలని, వారం చివర్లో లెక్కలు చూసుకుని, ఎవరి వాటాలు వారికి ఇవ్వాలని, ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవద్దని ఒప్పందం చేసుకున్నారు. ఓ నాయకుడు అధికారులతో మాట్లాడతాడని, అతను చెప్పినట్టుగా నడుచుకోవాలని ఏకంగా తీర్మానం చేయడం గమనార్హం. వైసీపీ, కూటమి నాయకుల్లోని ఒక సామాజికవర్గానికి చెందినవారు ఈ సమావేశంలో పాల్గొని దందా యావత్తూ వారి చేతుల్లోనే నడవాలని, వేరెవరినీ రానివ్వకుండా అడ్డుకోవాలని హుకుం జారీ చేశారు. దీనిపై కొందరు కూటమి నాయకులు రుసరుసలాడుతున్నారు. పార్టీ కోసం అందరూ పనిచేశారని, కొందరు మాత్రం ఇదే అదనుగా భావించి బుసకను అక్రమంగా తవ్వేస్తూ సొమ్ము చేసుకోవడం ఎంతవరకు సమంజసమనే వాదనను వినిపిస్తున్నారు. సముద్ర తీర గ్రామాలకు ముప్పు తెచ్చేలా ఈ తవ్వకాలు జరుగుతున్నాయని, పార్టీకి చెడ్డపేరు వస్తుందని, భవిష్యత్తులో ప్రజలు ఈ విషయంపై ప్రశ్నిస్తే ఏం సమాధానం చెప్పాలని వారు చర్చించుకుంటున్నారు.ఎవరా చోటా నాయకుడుసముద్ర తీరంలోని ప్రభుత్వ భూముల నుంచి బుసకను అక్రమంగా తరలిస్తున్న అంశంపై ఈ చోటా నాయకుడిపై సీఎంవోకు అనేక ఫిర్యాదులు అందాయి. అయినప్పటికీ మంగినపూడి పరిసర గ్రామాలను తమ చెప్పుచేతల్లో పెట్టుకున్న కొందరు పెద్దలు బుసక రవాణాకు అండగా నిలుస్తున్నారు. ఈ చోటా నాయకుడు స్థానిక ప్రజాప్రతినిధికి, ప్రతిపక్ష నాయకుడికి కూడా అనుకూలంగా ఉంటున్నాడనే విమర్శలు వస్తున్నాయి. అధికార, ప్రతిపక్ష నాయకులతో అంటకాగుతున్న ఈ చోటా నాయకుడు మైనింగ్ విభాగం అధికారులను తన గుప్పెట్లో పెట్టుకుని బుసక అక్రమ రవాణావైపు రాకుండా తెరవెనుక మంత్రాంగం నడుపుతున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక ప్రజాప్రతినిధి మాటకన్నా, ఈ చోటా నాయకుడు చెప్పినట్టుగానే మైనింగ్ అధికారులు వ్యవహ రిస్తున్నారని చెబుతున్నారు. బుసక అక్రమ తవ్వకాలు, విక్రయాలను తమ చెప్పుచేతల్లో పెట్టుకున్న కొందరు తాము చెప్పినట్టుగానే మండలంలోని రాజకీయం, ఇతరత్రా వ్యవహారాలు నడుస్తాయని తప్పుడు సంకేతాలు ఇస్తుండటంతో ఈ వ్యవహారం రాజకీయంగానూ దుమారం రేపుతోంది.చినయాదరలో వేగవంతంపెదయాదర పంచాయతీ శివారు చినయాదరలోని తుమ్మాచెరువు నుంచి మట్టి అక్రమ తవ్వకాలను రెండు రోజులుగా వేగవంతం చేశారు. గతంలో ట్రాక్టర్ల ద్వారా మాత్రమే మట్టిని తరలించిన స్థానిక ప్రజాప్రతినిధి.. రెండు రోజులుగా టిప్పర్లను రంగంలోకి దించి మట్టిని తరలిస్తున్నాడు. దీనిపై స్థానికులు ఫొటోలు తీసి మరీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా రెవెన్యూ, మైనింగ్ అధికారులు అటువైపు చూడలేదు.

# చేనేతే జీవితంగా..!




వెంకటగిరి, జులై 11(టుడే విదుర): చిన్నప్పుడే చేనేతపై దృష్టి పెట్టారు. ఇందులో నైపుణ్యం సాధించి.. రాణిస్తూనే ఐటీఐ మెకానికల్ డ్రాఫ్ట్‌మేన్ కోర్సు పూర్తి చేశారు. శ్రీహరికోటలో ఓ ఉద్యోగం కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ తర్వాత పూర్తి సమయాన్ని చేనేత పనికే కేటాయించారు. చీరలపై జాందాని వర్కు చేయడంలో ప్రావీణ్యం సాధించారు. ఇలా చేనేతనే జీవితంగా మార్చుకుని.. పూర్తి సమయం కేటాయించారు వెంకటగిరికి చెందిన నేతన్న లక్కా శ్రీనివాసులు. అందుకే ఇప్పుడు రెండోసారి ఆయన సంత్ కబీర్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. 'దేశంలో ఎక్కడాలేని జాందాని పనిపై దృష్టి సారించా. ఆపోజిట్ ఎగస్ట్రావర్ప్ ఇంటర్‌లాక్ సిస్టం విధానాన్ని మగ్గంపై ఉంచి చీర్లపై అద్భుతమైన డిజైన్లు సృష్టించా. 2013లో గోకుల బృందావనం అనే వాల్ హ్యాంగింగ్ నేయగా.. అది జాతీయ అవార్డుకు ఎంపికైంది. 2015లో ఈ అవార్డును ప్రధాని చేతుల మీదుగా అందుకున్నా. భగవద్గీత శ్లోకాలను చీరపై నేసి ఇస్కాన్ టెంపుల్‌కు అందించా. గతంలో చీర నేసేది ఒకరు.. అవార్డు పొందేది మరొకరుగా ఉండేది. ఆ విధానంపై నేను అప్పటి కేంద్ర మంత్రి ఎం.వెంకయ్య నాయుడు దృష్టికి తీసుకెళ్లి అర్హులకే అవార్డు అందేలా పరీక్షా విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చాం. ఇప్పుడు అవార్డుకు ఎంపికైన 'లక్ష్మీ వృక్షం' చీర తయారు చేయడానికి నాలుగు నెలల సమయం పట్టింది. దీంతో పాటు మరో రెండు చీరలు పంపినా, అవి అర్హత సాధించలేదు' అని లక్కా శ్రీనివాసులు వివరించారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఇలాంటి అద్భుతాలు మరెన్నో చేసి చూపుతామన్నారు.వెంకటగిరి టౌన్ 'సంత్ కబీర్' జాతీయ అవార్డుకు ఎంపికైన వెంకటగిరి బొప్పాపురం సాలికాలనీకి చెందిన లక్కా శ్రీనివాసులును కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సన్మానించారు. సంత్ కబీర్ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. వెంకటగిరి చీరలకు ప్రపంచ ఖ్యాతి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, టీడీపీ నాయకులు బీరం రాజేశ్వరరావు, శ్రీరామదాసు గంగాధర్, పోలంరెడ్డి వెంకటరెడ్డి, అవ్వారు శ్రీనివాసులు, చంద్రమౌళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కమిషనర్ ఆకస్మిక తనిఖీ



గిద్దలూరు, జులై 11(టుడే విదుర): పట్టణంలోని పలు వీధులను మున్సిపల్ కమిషనర్ రమణబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొన్ని చోట్ల మురుగు కాలువల్లో చెత్తాచెదారంతో ఎండిపోయి ఉండడాన్ని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చుట్టుపక్కల ప్రజలను పిలిచి చెత్తను రోజూ చెత్త రిక్షాలలో మాత్రమే వేయాలని సూచించారు. చెత్తను కాల్వలో వేస్తే మురుగు కదలక దోమలు పెరిగి రోగాలబారిన పడతారన్నారు. పలు చోట్ల జరుగుతున్న సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. నాణ్యతతో వేయాలని సిబ్బందికి కమిషనర్ సూచించారు.

# కాలువల అభివృద్ధితో సురక్షితమైన తాగునీరు



జులై 11(టుడే విదుర):కైకలూరు, కాలువల అభివృద్ధితో సురక్షితమైన తాగునీరు కాలువల అభివృద్ధితో ప్రజలకు సురక్షితమైన తాగునీరును అందిస్తామని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. కైకలూరు పంట కాలువకు నీరు విడుదలైన సందర్భంగా కైకలూరు%-%కోరుకొల్లు రోడ్డులోని వంతెన వద్ద కృష్ణమ్మకు పసుపు, కుంకుమలతో డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఒక్క కాలువను అభివృద్ధి చేయక పోవడంతో అన్యాయంగా మారాయన్నారు. ప్రస్తుతం కాలువలను అభివృద్ధి చేయడం వల్ల ఎగువనుంచి నీరు పుష్కలంగా వస్తోందని, శివారు గ్రామాలకు సైతం సరఫరా చేస్తామని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు మంచినీటి చెరువులు నింపేందుకు సహకరించాలన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, కూటమి నేతలు పూల రాజీ, కేకే బాబు, ఎండీ జాని, కీర్తి వెంకటరాంప్రసాద్, కేవీఎన్ఎం నాయుడు, గంగుల ఏసురాజు, పడమటి వాసు, అధికారులు పాల్గొన్నారు.

# పరుపుల తయారీ పరిశ్రమ దగ్ధం



ఏలూరు క్రైం,జులై 11(టుడే విదుర): అగ్ని ప్రమాదంలో పరుపుల తయారీ కంపెనీ, గోడౌన్ పూర్తిగా దగ్ధమైంది. ఏలూరు సమీపంలోని కొత్తూరు రోడ్ వంగాయిగూడెం క్యాన్సర్ ఆసుపత్రి ఎదురుగా సుస్మిత ఫర్నీచర్ కుషనింగ్ సంస్థను శీలంశెట్టి రాజా, శీలంశెట్టి కిశోర్‌కుమార్, శీలంశెట్టి సంధ్య, కొండవీటి నీలిమ నిర్వహిస్తున్నారు. జ్యూట్‌మిల్లు గోడౌన్లు లీజుకు తీసుకుని పరుపుల తయారీ, స్పాంజ్, ఫోమ్, ఇతర షీట్లు తయారీ కొనసాగిస్తున్నారు. ఫ్యాక్టరీ నుంచి కార్మికులు వెళ్లిపోయిన తర్వాత బుధవారం రాత్రి ఇద్దరు వాచ్‌మెన్‌లు ఉన్నారు. స్పాంజ్, ఫోమ్ తయారీకి ఉపయో గించే రసాయనాలు కూలింగ్‌లో ఉంచాలి. ఈ రెండు ట్యాంకుల వద్ద పెద్ద ఏసీని గురువారం ఉదయం 6 గంటలకు వాచ్‌మెన్ ఆన్‌చేశాడు. తర్వాత మెయిన్ గేటు వద్ద టిఫిన్ చేస్తుండగా 6.30 గంటల సమయం లో లోపల నుంచి పొగలు రావడం గమనించారు. క్షణాల్లోనే స్పాంజ్, ఫోమ్ ఇతర కెమికల్స్ మండడంతో భారీ ఎత్తున పొగలు వ్యాపించాయి. మంటలు ఎగిసి పడడంతో చుట్టుపక్కల వారు భయభ్రాంతులయ్యారు. ఎదురుగా క్యాన్సర్ ఆసుపత్రి లో రోగుల రక్షణకు ఆసుపత్రి సిబ్బంది ముందస్తు జాగ్ర త్తలు తీసుకున్నారు. సమాచారం అందుకున్న జిల్లా అద నపు అగ్నిమాపక శాఖ అధికారి వి.రామకృష్ణ 2 ఫైర్ ఇంజన్లతో చేరుకున్నారు. మరోవైపు భీమడోలు, హనుమాన్ జంక్షన్, కైకలూరు ఫైర్ ఇంజన్లు కూడా రప్పించారు. 3 గంటల పాటు 5 ఫైర్ ఇంజన్లు మంటలను ఆర్పుతూనే ఉన్నాయి. అప్పటికే గోడౌన్‌లో కెమికల్స్, ఫోమ్, పరుపులకు సంబంధించిన మెటీరియల్ మొత్తం దగ్ధమైంది. కోట్లాది రూపాయల్లో నష్టం వాటిల్లింది. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, సిబ్బంది అక్కడకు చేరు కుని చుట్టు పక్కల ప్రజలను అప్రమత్తం చేశారు. మరో వైపు ఏలూరు పెదపాడు మార్గంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరా యం లేకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకు న్నారు. ఏసీ ఆన్‌చేయడంతో రసాయనాలు మండి ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. గోడౌన్ పక్కనే ఉన్న ఫంక్షన్ హాల్ ఏసీలు దగ్ధమయ్యాయి.

# పశువులను మేపడానికి వెళ్లిన యువకుడు.. వాగులో గల్లంతు



చింతలమానేపలి(టుడే విదుర) పశువులను మేత మేపడానికి తీసుకెళ్లిన యువకుడు వాగులో గల్లంతైన ఘటన చింతలమానేపల్లి మండలంలోని కేతిని సమీపంలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన సేడ్మక సుమన్ (18) వాగు అవతల ఉన్న తమ పంట పొలాల్లో పశువులను మేత మేపడానికి తీసుకెళ్లాడు. అవి పంటను తింటుండటంతో ముగ్గురు స్నేహితులతో కలిసి వాగు దాటేందుకు యత్నించారు. అయితే నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో మునిగిపోయారు. %ముగ్గురు కష్టంగా ఒడ్డుకు చేరుకోగా, సుమన్ మాత్రం నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఒడ్డున ఉన్న తోటి మిత్రులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు గల్లంతైన యువకుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.

# లష్కర్ బోనాలకు అమ్మవారి ఆలయాలు సిద్ధం..



సికింద్రాబాద్: జులై 11(టుడే విదుర):ఈ నెల 13, 14వ తేదీల్లో జరిగే బోనాల జాతరకు సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంతో పాటు లష్కర్‌లోని అమ్మవారి ఆలయాలను సిద్ధం చేస్తున్నారు. జాతర సమీపిస్తుండడంతో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఈ మేరకు అన్ని విభాగాలతో సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక సమావేశం జరిగింది.త్తర మండల డీసీపీ రష్మీ పెరుమాళ్, దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కృష్ణవేణి, ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి, మహంకాళి ఏసీపీ సైదయ్య, ఇన్‌స్పెక్టర్ పరశురామ్‌లతోపాటు ఆలయ బోనాల జాతర కమిటీ సభ్యులు, భక్తులు సమావేశంలో పాల్గొన్నారు. బోనాలతో వచ్చే మహిళల కోసం ప్రత్యేక రెండు లైన్లు, సాధారణ భక్తుల కోసం మరో లైన్లు, వీటికి అదనంగా మరో రెండు లైన్లు ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. %2,500 మందితో పోలీసు సిబ్బంది ఏర్పాటు చేస్తున్నట్లు డీసీపీ తెలిపారు. మహంకాళి పోలీస్ స్టేషన్‌లో 24 గంటల పాటు పని చేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. 4 వైద్య బృందాలను కూడా సిద్ధంగా ఉంచనున్నట్టు చెప్పారు. 13వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట, మూడు గంటల మధ్య బాటా నుంచి ఆలయానికి శివసత్తులను అనుమతించనున్నట్టు వెల్లడించారు.

బంగారు బోనం సమర్పణ

భాగ్యనగర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఉజ్జయినీ మహాకాళి అమ్మవారికి గురువారం బంగారు బోనం సమర్పించారు. కమిటీ సభ్యులతో భక్తురాలు నిషా క్రాంతి విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# హైదరాబాద్‌లో కల్తీ కల్లు ఘటన.. పెరిగిన మృతులు



హైదరాబాద్:జులై 11(టుడే విదుర):కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో బాధితుల సంఖ్య 51కి చేరింది. గాంధీ ఆస్పత్రిలో 14 మంది బాధితులకు చికిత్స కొనసాగుతోంది. అలాగే నిమ్స్‌లో 34 మంది కల్తీ కల్లు బాధితులకు చికిత్స అందిస్తున్నారు. నిమ్స్‌లో వైద్యులు ఆరుగురికి డయాలసిస్ చేస్తున్నారు. ఈఎస్ఐలో ఒకరు, ప్రైవేట్ ఆస్పత్రిలో మరొకరికి చికిత్స కొనసాగుతోంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ ఇప్పటి వరకు కల్తీ కల్లుకు తొమ్మిది మంది మృతిచెందారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ గంగారాం(70) అనే వ్యక్తి మృతిచెందారు.అయితే, కల్తీ కల్లు ఘటనలో తెలంగాణ సర్కార్ సీరియస్ అయింది. ఈ మేరకు పోలీసులకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో కూకట్‌పల్లి పోలీసులు ఈ కేసులో దర్యాప్తు ముమ్మరం చేశారు. పోలీసుల అదుపులో ఏడుగురు నిందితులు ఉన్నారు. బాలానగర్ ఎక్సైజ్ పీఎస్‌లో ఐదు కేసులు నమోదు చేశారు. కూకట్‌పల్లి, పీఎస్‌లలో మూడు కేసులు నమోదయ్యాయి. ఐదు కల్లు కాంపౌండ్‌ల నుంచి అధికారులు శాంపిల్స్ సేకరించారు. నారాయణగూడ ఎక్సైజ్ ల్యాబ్‌కు అధికారులు పంపించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి బాధితులను పరామర్శించారు. ఎప్పటికప్పుడు అధికారులని అడిగి వివరాలు తెలుసుకుంటున్నారు. బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందజేయాలని మంత్రులు సూచించారు.

# వృద్ధురాలైన తల్లిని రోడ్డు మీద వదిలేసి..



గూడూరు (మహబూబాబాద్ జిల్లా), జులై 11(టుడే విదుర): వృద్ధురాలైన తల్లిని నెల రోజుల చొప్పున వంతులవారీగా పోషించేలా మాట్లాడుకున్న ఆ ముగ్గురు కుమారులు.. చివరకు ఆమెను రోడ్డు మీద వదిలేశారు. మహబూబాబాద్ జిల్లా గూడూ రు మండలం భూపతిపేటలో ఈ ఘటన వెలుగుచూసింది. వెంగంపేటకు చెందిన బొడ్డు భద్రమ్మ (75)కు ఆరుగురు సంతానంలో వెంకన్న, సుధాకర్, రమేశ్, యాకస్వామి కుమారులు. ఆరుగురికీ పెళ్లిళ్లు అయ్యాయి. భద్రమ్మ భర్త ముత్తయ్య 20 ఏళ్ల క్రితం మృతిచెందాడు. పెళ్లిళ్లయ్యాక కుమారులకు 30 గుంటల చొప్పున సాగుభూమిని భద్రమ్మ పంచి ఇచ్చింది. పెద్ద కుమారుడు వెంకన్న పదేళ్ల క్రితం మృతిచెందాడు. భద్రమ్మ కూలి పనులకు వెళుతూ బతుకుతోంది.వయసు మీద పడటంతో తన పనులు తాను చేసుకోలేని స్థితికొచ్చిన తల్లిని.. ముగ్గురు కుమారులు, పెద్ద కోడలు కొన్నాళ్లుగా వంతులవారీగా పోషిస్తున్నారు. అయితే.. పెద్ద కోడలు అనసూర్య వంతు వచ్చేసరికి.. ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ అత్తను పోషించలేనని తేల్చిచెప్పింది. దీంతో తల్లిని యాకస్వామి భూపతిపేట రైతువేదిక వద్ద వదిలేసి తన ఊరికి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు.. గ్రామస్థుల సమక్షంలో ముగ్గురు కుమారులు, వారి భార్యలను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆపై ముగ్గురు కోడళ్లు సులోచన, ఉపేంద్ర, నాగలక్ష్మి కలిసి ఆటోలో అత్త భద్రమ్మను వెంటబెట్టుకొని పెద్దకోడలు అనసూర్య ఇంటికి తీసుకువెళ్లారు.

# వర్షపునీటిని ఒడిసి పట్టాలి



నెన్నెల, జులై 11(టుడే విదుర): వర్షపు నీటిని ఒడిసి పట్టి భూమిలో ఇంకేలా కృషి చేస్తే భావితరాలకు ఇబ్బందులు లేకుండా ఉంటుందని కేంద్ర జలశక్తి శాఖ భూగర్భజల శాస్త్రవేత్త కొల్లి రాంబాబు అన్నారు. జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులను పరిశీలించేందుకు కేంద్ర బృందం మండలంలో పర్యటించింది. ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ సోక్‌పిట్స్, ఫారంపాండ్, ఊటకుంటలను బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ నీటి సంరక్షణ, పారుదల సామర్థ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో జలశక్తి అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందన్నారు. భూగర్భ జలాల పెంపులో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. గ్రామాల్లో ఇంటికో ఇంకుడుగుంత నిర్మించుకోవాలని సూచించారు. ఇళ్లలో వాడుకునే నీటిని రోడ్లపైకి వదలకుండా ఇంకుడు గుంతల్లోకి మళ్లిస్తే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. మండలంలో చేపట్టిన పనులపై కేంద్ర బృందం సంతృప్తిని వ్యక్తం చేసింది. డీఆర్‌డీఏ నోడల్ ఆఫీసర్ సదానందం, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్, ఉపాధిహామీ టెక్నికల్ సభ్యులు సత్యనారాయణ, మధు, ఇన్‌చార్జి ఎంపీడీవో వీణా, ఏపీవో నరేష్, ఈసీ స్వామి తదితరులు ఉన్నారు.

# వలస వస్తున్న పులులు



సిపేట,జులై 11(టుడే విదుర):అడవులకు పులుల రాకతో కొత్త అందాలను సంతరించుకుంటున్నాయి. గడిచిన రెండేళ్లలో మంచిర్యాల, బెల్లంపల్లి అటవీ డివిజన్‌లోకి మహారాష్ట్ర నుంచి నాలుగు పెద్దపులులు వలస వచ్చాయి. అతిథులుగా వచ్చి వెళ్తున్నాయి. కాని సరైన అవాసాలు లేక స్థిరంగా ఉండడం లేదు. పులుల వలసలో అడవిలోని హాబిటేషన్లు గణనీయంగా పెరిగాయి. అడవిలో పరుచుకున్న పచ్చదనం ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పులులు ఊరు శివారు ప్రాంతంలోకి వచ్చినప్పటికీ ఆవుల మందలపై దాడులు చేసిన ఘటనలు ఉన్నాయి. కాని అవి ఎక్కడ కూడా మనుషులపై దాడి చేయకపోవడం విశేషం.

అతిథులుగా పెద్ద పులులు..

మంచిర్యాల జిల్లాలో 1,76,699.21 హెక్టార్లలో అడవి విస్తరించంది. కవ్వాల్ టైగర్ జోన్‌లోకి వలస రాని పులులు మంచిర్యాల, బెల్లంపల్లి అటవీ డివిజన్‌లోని రావడంతో అటవీశాక అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది జనవరి 31 నుంచి రెండు నెలల పాటు బీ1 పెద్దపులి మంచిర్యాల డివిజన్‌లో సంచరిస్తూ భూపాలపల్లి అటవీడివిజన్‌లోకి వెళ్లింది. అలాగే ఎస్12 పెద్దపులి కూడా గత ఏడాది అక్టోబరులో బెల్లంపల్లి, మంచిర్యాల అటవీ డివిజన్‌లో మూడు నెలలు నివాసం ఉంది. ఎట్టకేలకు ఎస్12 పెద్దపులి వేములవాడ అటవీ డివిజన్ పరిధిలోకి సురక్షితంగా చేరుకుంది. ఆరు నెలలుగా లక్షెట్టిపేట రేంజ్ పరిధిలో స్థిర నివాసం ఏర్పరుచుకున్న ఎల్1 పెద్దపులి మాత్రం తన ఆవాసాన్ని సురక్షితం చేసుకొని స్థిరంగా ఉంది. ఇప్పుడు బెల్లంపల్లి, మంచిర్యాల అటవీ డివిజన్లతో పాటు కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని అటవీరేంజ్ పరిధిలో వారం రోజులుగా పెద్దపులి సంచరిస్తూ హడలెత్తిస్తోంది. గత సోమవారం ముత్యంపల్లి అటవీసెక్షన్ పరిధిలోని వెంకటాపూర్ అటవీశివారులో ఆవుల మందపై దాడి చేసి లేగదూడను హతమార్చింది. దీంతో అటవీశివారు ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ పులినైన మంచిర్యాల జిల్లాలో స్థిరంగా ఉండేందుకు అటవీశాఖ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పులుల సంరక్షణతో పాటు నీటి వసతి, శాకాహార జంతువుల సంఖ్య పెరగడం అనుకూలమైన పచ్చగడ్డి, ప్రశాంత వాతవరణం పెద్ద పులుల ఆవాసానికి కలిసి వచ్చే అంశాలే. ఈసారి వచ్చిన పెద్ద పులులు మంచిర్యాల జిల్లాలోనే స్థిరంగా ఉంటాయని అటవీశాక అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

# నేర రహిత సమాజ స్థాపనే లక్ష్యం



మందమర్రిటౌన్, జులై 11(టుడే విదుర): నేరరహిత సమాజ స్థాపనే లక్ష్యమని, ఇందుకు ప్రజలందరూ సహకరించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పేర్కొన్నారు. మందమర్రి పట్టణంలోని జాతీయ రహదారిపై డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం కాలినడకన చెంచు కాలనీ, విద్యానగర్ కాలనీల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలు విక్రయించే వారిపై నిఘా ఉంటుందన్నారు. అక్రమంగా మత్తు పదార్థాలు, గంజాయి తరలించినా, విక్రయించినా, సేవించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కళాశాలలు, పాఠశాలల్లో మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఆటో డ్రైవర్లు, ద్విచక్రవాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. అనంతరం పాత బస్టాండ్ నాకా బందీ కార్యక్రమం నిర్వహించి నంబరు ప్లేట్లు లేని, సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు.



# టుడే వినోదం

## బాహుబలి మళ్లీ వస్తున్నాడు




భారతీయ సినీ చరిత్రలో 'బాహుబలి'కి ఎంతటి ప్రత్యేక స్థానం ఉందో చెప్పక్కర్లేదు. టాలీవుడ్ స్థాయిని ప్రపంచానికి చాటి చెప్పిన ఈ సినిమా మొదటి భాగం విడుదలై 10 ఏళ్లు అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి అభిమానులకు తీపికబురందించాడు. 'బాహుబలి: ద బిగినింగ్', 'బాహుబలి: ద కన్‌క్లూజన్'.. రెండు భాగాలను కలిపి 'బాహుబలి: ద ఎపిక్'గా అక్టోబర్ 31న రీ రిలీజ్ చేయనున్నట్లు ఎక్స్ వేదికగా ప్రకటించారు. ''బాహుబలి.. ఎన్నో అద్భుతమైన ప్రయాణాలకు ఆరంభం. లెక్కలేనన్ని జ్ఞాపకాలను ఇచ్చింది. ఎంతోమందికి స్ఫూర్తిని పంచింది. ఈ సినిమా రెండు భాగాలను కలిపి 'బాహుబలి ద ఎపిక్' పేరిట మరోసారి మీ ముందుకు తీసుకువస్తున్నాం'' అని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న సినీ ప్రియుల ఆనందం రెట్టింపైంది. చిత్రం విడుదలై పదేళ్లు అయిన సందర్భంగా బుధవారం రాత్రి 'బాహుబలి' టీమ్ రీ యూనియన్ మీట్ హైదరాబాద్‌లో జరిగింది. ఇందులో రాజమౌళి, ప్రభాస్, రానా, రమ్యకృష్ణతో సహా టోటల్ టీమ్ పాల్గొన్నారు. రమ్యకృష్ణ సినిమాలోని తన డైలాగు 'ఇది నా మాట. నా మాటే శాసనం' అనే ఫ్లకార్డు పట్టుకుని ఫోజివ్వడం ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. కాగా, 2015లో ఈ సినిమా ప్రచారంలో భాగంగా రాజమౌళి వాడిన 'బాహుబలి వస్తున్నాడు' అనే హ్యాష్‌టాగ్ ఇప్పుడు వైరల్ అవుతోంది.

## ఓటీటీలో ఇరగదీస్తున్న.. లేటెస్ట్ సర్వైవల్ థ్రిల్లర్! ఎందులో చూడాలంటే




ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు ఓ డిఫరెంట్ సర్వైవల్ థ్రిల్లర్ బ్రిక్ డిజిటల్ స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. జర్మన్ భాషలో వచ్చిన ఈ చిత్రాన్ని నెట్‌ఫ్లిక్స్ స్వయంగా నిర్మించగా ఫిలిప్ కోచ్‌రచించి దర్శకత్వం వహించారు. మాథియాస్ ష్వీఘ్ఫెర్ రూబీ ఓ ఫీ ) ప్రధాన పాత్రల్లో నటించారు. ఇటీవలే ఓటీటీకి వచ్చిన ఈ చిత్రం వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ సరికొత్త థ్రిల్‌ను పంచుతోంది. చూసిన వారంతా మరి కొంతమందిని చూడమని రెఫర్ చేస్తున్నారు. 1 గంట 39 నిమిషాల నిడివితో సినిమా చివరి వరకు సస్పెన్స్, ట్విస్టులతో అలరిస్తుంది. %ఈ సినిమా కథ విషయానికి వస్తే.. టిమ్, ఒలివియా భార్యాభర్తలు ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తూ ఉంటారు. అయితే ఒలివియాకు మిస్ క్యారేజ్ అవడంతో మానసికంగా కాస్త బలహీనం అవుతారు. దాతో వారిద్దరు ముభావంగా ఒకరికొకరు దూరంటా ఉంటూ ఆ ఇంట్లోనే వేర్వేరుగా వ్యవహరిస్తుంటారు. అయితే ఈ సమస్య నుంచి బయట పడాలని ఒలీవియా ఓ ట్రిప్ ప్లాన్ చేస్తుంది. %దానికి టిమ్ అంగీకరించక పోవడంతో ఒలివియా ఒంటరిగానే వెళ్లాలని ఫిక్స్ అయి బయటకు వెళ్లడానికి డోర్ తెరవగా అశ్చర్యకరంగా గోడలు దర్శణమిస్తాయి. చివరకు కిటికీల వద్ద కూడా అదే తరహా గోడలు ఉండి వారు ఇంటి నుంచి బయటకు పోలేకుండా, బయట ప్రపంచంతో ఎలాంటి సంబంధం లేకుండా, నెట్ వర్క్ సిగ్నల్ సైతం రాకుండా బందీ అయిపోతారు. వీరితో పాటు మరో నాలుగైదు ఫ్లాట్ల వాళ్లు సైతం ఇలాగే ఇరుక్కుపోతారు.

## తొలిసారి వెండితెరపై..



### బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్ కోసం తొలిసారి...

బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ సరసన తొలిసారి చిత్రాంగద సింగ్ నటిస్తోంది. అదీ ప్రతిష్టాత్మక చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గాల్వన్'లో. సల్మాన్ ఖాన్ ఆర్మీ అధికారిగా నటిస్తున్న ఈ సినిమా వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోంది. %ప్రస్తుతం 'బ్యాటిల్ ఆఫ్ గాల్వన్' సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. భారత్ – చైనా సరిహద్దుల వద్ద 2020లో గాల్వాన్ లో జరిగిన యుద్ధం గురించి తెలిసిందే. ఆ సంఘటనలనే దర్శకుడు అపూర్వ లఖియా వెండితెరపై ఆవిష్కరిస్తున్నారు. ఈ సినిమాలో చిత్రంగద సింగ్ ను తీసుకోవడంపై దర్శకుడు అపూర్వ స్పందిస్తూ, 'చిత్రాంగద నటన, ప్రతిభ కారణంగానే ఎంపిక చేసుకోవడం జరిగింది. ఆమెలో కలిసి పనిచేయాలని ఎప్పటి నుండో అనుకుంటున్నాను. ఇప్పటికి కుదిరింది' అని చెప్పారు. ఇరవై సంవత్సరాల క్రితం 'హజారోం ఖ్వాయిషీ ఐసీ' చిత్రంతో చిత్రాంగద సింగ్ సిల్వర్ స్క్రీన్ ఎంట్రీ ఇచ్చింది. కొంతకాలంగా ఆమెకు తెలుగులోనూ పలు ఆఫర్స్ వచ్చినా... ఎందుకో అవేవీ మెటీరియలైజ్ కాలేదు. అయితే తమిళ అనువాద చిత్రం సికందర్'తో చిత్రాంగదా సింగ్ తెలుగువారికి సుపరిచితమే. అందులో ఆమె ఐటమ్ సాంగ్ లో నర్తించింది.

## దర్శక నిర్మాత గిరిబాబు భార్య మృతి




తెలుగు, కన్నడ చిత్రాల దర్శకుడు, నిర్మాత బండారు గిరిబాబు సతీమణి సత్యవతి వృద్ధాప్య సమస్యలతో జులై 5వ తేదీ కన్నుమూశారు. ఈ సమాచారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రముఖ నటుడు రంగనాథ్ ను 'చందన' సినిమా ద్వారా హీరోగా పరిచయం చేసింది గిరిబాబే! ఆయన 1994లో కన్నుమూశారు. గిరిబాబు, సత్యవతి దంపతుల పెద్ద కుమార్తె కూడా కన్నడలో పలు టీవీ సీరియల్స్ ను, యాడ్ ఫిల్మ్ ను తీశారు. ఆవిడ పదేళ్ళ క్రితం చనిపోయారు. %అరకులోయ అందాలను మొట్టమొదట సినిమాలలో ఎక్స్‌ప్లోర్ చేసింది గిరిబాబే. ఆయన తెలుగులో 'జీవితం, రత్తాలు రాంబాబు, చందన' చిత్రాలను తీశారు. అలానే 'బొమ్మరిల్లు, నాలుగు స్తంబాలాట' సినిమాలను అప్పట్లో కన్నడలో రీ–మేక్ చేశారు. మరో మూడు సినిమాలను, 'పరివార' సీరియల్ ను కన్నడలో టీవీ కోసం తీశారు.

## మళ్లీ లైన్‌లోకి.. వచ్చిన అషురెడ్డి! నెటిజన్లకు పండగే




సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్, బిగ్‌బాస్ ఫేమ్ అషురెడ్డి మరోసారి గ్లామర్ గేట్లు తెరిచింది. గడిచిన రెండు మూడేండ్ల తన హాట్ ఫోటోలతో, బాలీవుడ్ కథానాయికలను తలదన్నేలా అంగాంగ ప్రదర్శణలతో రెచ్చిపోయి సోషల్ మీడియాను షేక్ చేసిన ఈ ముద్దగుమ్మ కొంత కాలం సైలెంట్ అయింది. %అనారోగ్య సమస్యలతో ఆరేడు నెలలు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్న ఈ చిన్నది మళ్లీ తెరపైకి వచ్చి గ్లామర్ అండ్ స్టైల్‌తో మరింతగా ఆకట్టుకుంటోంది. %సోషల్ మీడియా వేదికగా వరుస ఫొటోషూట్లు, వీడియోలతో యూత్ మనసులను కొల్లగొడుతోంది. ఓ రేంజ్‌లో అందాల భోజన, ఫలహారాలు వడ్డిస్తోంది. ఇప్పుడీ అమ్మడి జోరును చూస్తుంటే కొంతకాలం పాటు క ఫాలోవర్స్, నెటిజన్లకు నిత్యం పంచభక్ష పరమాన్నాలు గ్యారంటీగా లభిస్తాయని ఫుల్ ఖుషిలో ఉన్నారు.

## సూపర్ మ్యాన్ ఎలా ఉందంటే.. ట్విట్టర్ రివ్యూ




శ్వవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న భారీ హాలీవుడ్ చిత్రం సూపర్‌మ్యాన్: లెగసి శుక్రవారం వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. ఇప్పటికే చాలా దేశాల్లో పెయిడ్ ప్రీమియర్స్, నైట్ షోలు పడగా మన దేశంలోనూ చాలా ప్రాంతాలలో షోలు పడిపోయాయి. ఓ బాలీవుడ్, టాలీవుడ్ స్ట్రెయిట్ భారీ చిత్రం థియేటర్‌కు వచ్చిందా అనే రేంజ్‌లో 1000కి పైగా థియేటర్లలో విడుదలై ఇండియన్ బాక్సాపీసును షాక్ గురి చేస్తోంది. ఈ సినిమా నుంచి డేవిడ్ కోరెన్‌స్వెట్ కొత్త సూపర్‌మ్యాన్‌గా కనపడనుండగా రాచెల్ బ్రాస్నహన్, నికోలస్ హౌల్ట్ కీలక పాత్రల్లో నటించారు. గతంలో భారీ విజయవంతమైన చిత్రాలు సూసైడ్ స్క్వాడ్, గార్డియన్స్ ఆఫ్ ది గెలక్సీ సినిమాలను తెరకెక్కించిన జేమ్స్ గన్ (%జీుఎవం +బఅఅ%) ఈ చిత్రానికి దర్శకత్వం వహించడం విశేషం. మరైతే ఇప్పటికే ఈ చిత్రం చూసిన వారు ఎలాంటి రివ్యూలు ఇస్తున్నారో, ఇచ్చారో, వారి అభిప్రాయాలేంటో ఇక్కడ చూద్దాం. %ఆరంభమే.. ఓ మిషన్‌లో పాల్గొని బాగా దెబ్బతిని పడి ఉన్న సూపర్ మ్యాన్‌ను చూయిస్తూ ఈ చిత్రం ప్రారంభం అవుతుంది. లూథర్ అనే వ్యక్తి ఎలాగైనా సూపర్ మ్యాన్‌కు ప్రజల్లో ఉన్న మంచి గుర్తింపును, ఫాలోయింగ్‌ను పూర్తిగా డిస్ట్రాయ్ చేసి అతన్ని నాశనం చేయాలని ప్రయత్నం చేసి అనేక కుట్రలతో ఓ వీడియో రిలీజ్ చేస్తాడు.

# టుడే స్పోర్ట్స్

## బాగుంది రా మామా



లార్డ్స్ టెస్టులో తెలుగు పదాలు వీనులవిందు చేశాయి. 'బాగుంది రా మామా.. 'అన్న మాటలు ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్ రెడ్డి అద్భుత బౌలింగ్‌కు ఫిదా అయిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అతడిని తెలుగులో ప్రశంసించడం అందరినీ ఆకట్టుకుంది. తొలి సెషన్‌లోనే ప్రధాన పేసర్లను సమర్థంగా ఎదుర్కొంటూ క్రీజులో పాతుకుపోయిన ఓపెనర్లు బెన్ డకెట్, జాక్ క్రాలేలను నితీశ్ ఒకే ఓవర్‌లో అవుట్ చేసి ఇంగ్లండ్‌కు షాకిచ్చాడు. దీంతో నితీశ్ బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు ఇంగ్లండ్ బ్యాటర్లు ఇబ్బందిపడ్డారు. ఈ క్రమంలో నితీశ్ వేసిన బంతి అద్భుతంగా స్వింగ్ అయినప్పుడు స్లిప్స్‌లో ఉన్న సారథి గిల్.. 'వాట్ రా రెడ్డి.. బాగుంది రా మామా' అని తెలుగులో పొగడడం స్టంప్ మైక్‌లో రికార్డయింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. అయితే అది గిల్ గొంతు కాదని, బహుశా కరుణ్ నాయర్‌ది అయివుండవచ్చునని అంటున్నారు. నాయర్ తెలుగు బాగా మాట్లాడుతాడని కొందరు చెబుతున్నారు.

## చరిత్ర సృష్టించిన భారత్



మాంచెస్టర్: భారత మహిళల జట్టు చరిత్ర సృష్టించింది. తొలిసారి ఇంగ్లండ్‌పై టీ20 సిరీస్ విజయాన్ని నమోదు చేసింది. బుధవారం రాత్రి జరిగిన నాలుగో మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. ఐదు టీ20ల సిరీసను 3-1తో మరో మ్యాచ్ మిగిలుండగానే సొంతం చేసుకొంది. స్పిన్నర్లు రాధా యాదవ్ (2/15), తెలుగమ్మాయి శ్రీచరణి (2/30), దీప్తి శర్మ (1/29) తిప్పేయడంతో.. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 126/7 స్కోరుకే పరిమితమైంది. భారత ఫీల్డింగ్ కూడా మెరుగ్గా ఉండడంతో ఇంగ్లండ్ పరుగుల కోసం తీవ్రంగా శ్రమించింది. డంక్లే (22), బ్యూమాంట్ (20) టాప్ స్కోరర్లు. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని భారత్ 17 ఓవర్లలో 4 వికెట్లకు 127 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (32), స్మృతి మంధాన (31) తొలి వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యంతో అదిరే ఆరంభాన్నిచ్చారు. ఆ తర్వాత జెమీమా (24 నాటౌట్), హర్మన్‌ప్రీత్ (26) ఆచితూచి ఆడుతూ జట్టును గెలుపు తీరాలకు చేర్చారు.

## అమందా సంచలనం



లండన్: వింబుల్డన్‌లో అమెరికా భామ అమందా అనిసిమోవా పెను సంచలనం సృష్టించింది. ఏకంగా టాప్ సీడ్ అర్యానా సబలెంకను ఓడించి.. కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. మరోవైపు 8వ సీడ్ ఇగా స్వియటెక్ మొదటిసారి వింబుల్డన్ తుది పోరుకు చేరుకొంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీసలో 13వ సీడ్ అమందా 6-4, 4-6, 6-4తో సబలెంకకు షాకిచ్చింది. 2 గంటల 36 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో సబలెంక 6 ఏస్‌లు కొడితే.. అనిసిమోవా 2 మాత్రమే సంధించింది. అమందా 13 విన్నర్లతో సబలెంకపై ఆధిపత్యం ప్రదర్శించింది. గ్రాస్ కోర్ట్ సెమీసలో ఓడడం సబలెంకకు ఇది మూడోసారి.స్వియటెక్ జోరు: ఏకపక్షంగా సాగిన మరో సెమీస్ మ్యాచ్‌లో పోలెండ్ స్టార్ స్వియటెక్ సునాయాసంగా నెగ్గింది. స్వియటెక్ 6-2, 6-0తో బెలిండా బెన్సిక్ (స్విట్జర్లాండ్)ను వరుస సెట్లలో ఓడించింది. శనివారం జరిగే టైటిల్ ఫైట్‌లో అమందాతో అమీతుమీ తేల్చుకోనుంది. వీరిద్దరూ తొలిసారి ఫైనల్ చేరడంతో.. ఈసారి వింబుల్డన్‌కు కొత్త చాంపియన్ రావడం ఖాయమైంది.హద్దుమీరిన ఆటగాళ్లకు ఫైన్: క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా రాకెట్లను విసిరికొట్టడం, సిబ్బందిని దూషించడం, క్రీడా పరికరాలపై అసహనాన్ని ప్రదర్శిస్తూ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్న ఆటగాళ్లపై వింబుల్డన్ నిర్వాహకులు భారీగా జరిమానాలు విధిస్తున్నారు.

## రూట్‌ను ఆటాడుకున్న జడేజా.. దమ్ముంటే పరిగెత్తమంటూ..!




సెంచరీ.. క్రికెట్‌లో ఏ బ్యాటర్ అయినా సరే ఈ మైలురాయికి చేరువగా వస్తే కాస్త టెన్షన్ పడతారు. అప్పటివరకు బౌండరీలు, సిక్సులతో దుమ్మురేపిన వారు కూడా ఒక్కసారిగా ఒత్తిడికి లోనవుతారు. మూడంకెల మార్క్‌ను అందుకునేంత వరకు ప్రెజర్ ఫీల్ అవుతారు. శతకం పూర్తయిన తర్వాత మళ్లీ తమ రొటీన్ స్టైల్‌లో ఆడతారు. అందుకే బ్యాటర్లను సెంచరీ మార్క్‌కు చేరుకోకుండా ప్రత్యర్థి జట్లు అడ్డుకుంటూ ఉంటాయి. లార్డ్స్ టెస్ట్ ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ సమయంలో ఇదే జరిగింది. సెంచరీకి చేరువగా వచ్చిన ఆ జట్టు టాప్ బ్యాటర్ జో రూట్‌ను ఓ ఆటాడుకున్నాడు టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా. దమ్ముంటే పరిగెత్తమంటూ అతడికి సవాల్ విసిరాడు. ఆ తర్వాత ఏం జరిగిందంటే..మూడో టెస్ట్ తొలి రోజు ఆట ముగింపు సమయంలో రూట్‌ను భయపెట్టాడు జడేజా. 99 పరుగుల వద్ద ఉన్న రూట్.. సెంచరీ మార్క్‌ను అందుకోవాలని అనుకున్నాడు. అందుకోసం తీవ్రంగా ప్రయత్నించాడు. ఆకాశ్‌దీప్ వేసిన చివరి ఓవర్‌లో వేగంగా పరుగులు తీసి మూడంకెలకు చేరుకోవాలని చూశాడు. కానీ జడేజా ఫీల్డింగ్ వల్ల అది సాధ్యం కాలేదు. ఆ ఓవర్ నాలుగో బంతికి డబుల్ తీద్దామని అనుకున్నాడు రూట్. కానీ బ్యాక్‌వర్డ్ పాయింట్ దగ్గర కాచుకొని ఉన్న జడ్డూ బంతిని అందుకున్నాడు. దమ్ముంటే పరిగెత్తు చూద్దాం.. అంటూ రూట్‌ను కవ్వించాడు భారత ఫీల్డర్. అసలే తోపు ఫీల్డర్ కావడంతో జడ్డూతో పెట్టుకోవడం ఎందుకని రూట్ అక్కడే ఆగిపోయాడు. ఆ తర్వాత అభిమానులతో పాటు అతడు కూడా నవ్వుల్లో మునిగిపోయాడు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.లార్డ్స్ టెస్ట్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ తొలి రోజును సంతృప్తిగా ముగించింది. బాగా అలవాటు పడిన బజ్‌బాల్ ఫార్ములాకు భిన్నంగా నెమ్మదిగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లీష్ బ్యాటర్లు.. భారత బౌలర్లను కాచుకొని పరుగులు తీయలేక అవస్థలు పడ్డారు. అయితే జో రూట్ (191 బంతుల్లో 99) ఒక ఎండ్‌లో స్తంభంలా పాతుకుపోయాడు.

## సక్సెస్ సీక్రెట్ చెప్పిన నితీష్ రెడ్డి.. వాళ్లిద్దరి వల్లే అంటూ..!




లార్డ్స్ టెస్ట్‌లో తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి అదరగొట్టాడు. కెరీర్‌లో ఇప్పటివరకు ఎక్కువగా బ్యాటింగ్‌లో సత్తా చాటుతూ వచ్చిన నితీష్.. ఈసారి బౌలింగ్‌లో దుమ్మురేపాడు. బ్రేక్‌త్రూల కోసం టీమిండియా ఎదురు చూస్తున్న తరుణంలో ఒకే ఓవర్‌లో ఇద్దరు ఇంగ్లండ్ బ్యాటర్లను వెనక్కి పంపించాడు తెలుగోడు. ఓపెనర్లు బెన్ డకెట్, జాక్ క్రాలేకు పెవిలియన్ దారి చూపించాడు. ఆ తర్వాత కూడా అతడు అదే రీతిలో బౌలింగ్ వేస్తూ పోయాడు. పిచ్ నుంచి స్వింగ్ రాబడుతూ ప్రత్యర్థి బ్యాటర్లను వణికించాడు. సెంచరీకి చేరువలో ఉన్న జో రూట్‌ను కూడా దాదాపుగా ఔట్ చేశాడు నితీష్. ఇలా ఊహించని రీతిలో సత్తా చాటిన తెలుగోడు.. తన సక్సెస్ సీక్రెట్ ఏంటో బయటపెట్టాడు.సన్‌రైజర్స్ హైదరాబాద్ సారథి ప్యాట్ కమిన్స్‌తో పాటు టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ వల్లే తాను ఇంత ప్రభావవంతంగా బౌలింగ్ చేయగలిగానని నితీష్ తెలిపాడు. ఐపీఎల్-2025 సమయంలో కమిన్స్ నుంచి కొన్ని బౌలింగ్ టిప్స్ తెలుసుకున్నానని పేర్కొన్నాడు. ఇంగ్లండ్ కండీషన్స్, ఇక్కడ బౌలింగ్ చేయాల్సిన విధానం గురించి అతడి నుంచి విలువైన సలహాలు, సూచనలు తీసుకున్నానని చెప్పుకొచ్చాడు. బౌలింగ్ కోచ్ మోర్కెల్ టిప్స్ కూడా చాలా పనికొచ్చాయని పేర్కొన్నాడు నితీష్.క్వాలిటీగా బౌలింగ్ చేయాలని అనుకున్నా. ఇందులో భాగంగానే నిలకడగా బంతులు వేయడం మీద దృష్టి పెట్టా. ఐపీఎల్ సమయంలో కమిన్స్ నుంచి పదే పదే టిప్స్ అడుగుతూ పలు కీలక విషయాలు తెలుసుకున్నా. ఇంగ్లండ్ పిచ్‌లు, వాతావరణ పరిస్థితులకు తగ్గట్లు ఆటను మార్చుకోవడం ఎలాగో అర్థం చేసుకున్నా. అది బాగా పనికొచ్చింది. దీనికి తోడు మోర్నీ మోర్కెల్ ఇచ్చిన సూచనలు కూడా భలేగా పనిచేశాయి. అతడితో వర్క్ చేస్తున్నప్పటి నుంచి బౌలింగ్‌లో చాలా ప్రోగ్రెస్ కనిపించింది' అని నితీష్ చెప్పుకొచ్చాడు.

## బజ్‌బాల్‌ను పక్కనబెట్టి




లండన్: బజ్‌బాల్ గేమ్‌తో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడే ఇంగ్లండ్ లార్డ్స్ టెస్టులో మాత్రం నెమ్మదించింది. అటు భారత బౌలర్లు విశేషంగా రాణించినప్పటికీ.. నాలుగు వికెట్లతోనే సరిపెట్టుకున్నారు. ఫలితంగా మూడో టెస్టు తొలి రోజు ఆటలో ఇంగ్లండ్‌దే ఒకింత పైచేయి అయింది. బ్యాటింగ్‌కు కష్టంగా మారిన పిచ్‌పై జో రూట్ (99 బ్యాటింగ్) పట్టుదలగా ఆడాడు. అతడి సెంచరీకి ఒక్క పరుగు దూరంలో ఆట ముగియగా, పోప్ (44), కెప్టెన్ స్టోక్స్ (39 బ్యాటింగ్) సహకరించారు. దీంతో గురువారం ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 251/4 స్కోరుతో నిలిచింది. నితీశ్‌కు రెండు.. బుమ్రా, జడేజాలకు ఒక్కో వికెట్ దక్కింది.

నితీశ్ 'డబుల్': టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌ను నిలడగా ఆరంభించింది. కొత్త బంతితో భారత పేసర్లు స్వింగ్‌తో పాటు ఎక్స్‌ట్రా బౌన్స్‌తో ఇబ్బందిపెట్టినప్పటికీ ఓపెనర్లు డకెట్ (23), క్రాలే (18) ఓపిగ్గా ఆడారు. దీంతో తొలి గంటలో వీరు 13 ఓవర్లలో 39 పరుగులు జత చేశారు. అయితే డ్రింక్స్ విరామం తర్వాత కెప్టెన్ గిల్ బంతిని నితీశ్‌కు ఇవ్వడం ఫలితాన్నిచ్చింది. తన తొలి ఓవర్‌లోనే డకెట్‌ను అవుట్ చేశాడు.

## పంత్‌కు గాయం



రెండో సెషన్‌లో వికెట్ కీపర్ రిషభ్ పంత్ చేతి వేలికి గాయమైంది. 34వ ఓవర్‌లో బుమ్రా వేసిన బంతిని అతడు ఎడమ వైపునకు డైవ్ చేస్తూ ఆపేందుకు ప్రయత్నించాడు. అయితే ఈ క్రమంలో పంత్ ఎడమ చేతి చూపుడువేలికి బంతి బలంగా తాకింది. నొప్పితో విలవిల్లాడిన అతనికి ఫిజియో వచ్చి చికిత్స చేశాడు. అయినా పంత్‌కు నొప్పి తగ్గకపోవడంతో ఆ ఓవర్ ముగిశాక మైదానం వీడగా.. జురెల్ కీపింగ్ చేశాడు. ప్రస్తుతం పంత్ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్టు బీసీసీఐ తెలిపింది.

# టుడే బిజినెస్

# బంగారం కొనాలనుకునే వారికి షాక్.

## . పెరిగిన బంగారం ధరలు..




బంగారం ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. పేద, మధ్య తరగతి కుటుంబాల వారికి షాకిస్తున్నాయి. ఓ రోజు తగ్గి.. మూడు రోజులు పెరుగుతున్నాయి. గత నెలలో 94 వేల దగ్గర ట్రేడ్ అయిన స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర ఇప్పుడు 98 వేల దగ్గర ట్రేడ్ అవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ ధర 3300 డాలర్ల పైనే ఉంది. గత సంవత్సరంతో పోల్చుకుంటే.. ఈ సంవత్సరం బంగారం ధరలు 37.63 శాతం పెరిగాయి. గత 28 రోజుల పరిస్థితి చూసుకుంటే.. బంగారం ధరలు 70 శాతం పెరిగాయి. హైదరాబాద్ నగరంలో నిన్న 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,200 రూపాయల దగ్గర..10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,400 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 73,800 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాముల బంగారంపై.. గ్రాముకు ఒక రూపాయి చొప్పున 10 రూపాయలు పెరిగింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,410 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,210 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర .. 73,810 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

# అమెరికాలో భారతీయుల సత్తా



న్యూఢిల్లీ: దేశం కాని దేశం. అయినా సరే 'ఆస్తుల సంపాదనలో తగ్గేదేలే' అంటున్నారు అమెరికాలోని భారతీయులు. విద్య లేదా ఉ పాధి కోసం అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడిన భారతీయుల్లో కొందరు రెండు చేతులా సంపాదిస్తున్నారు. ఈ సంపాదనలో వీరు స్థానిక అమెరికన్లనూ మించిపోతున్నారు. అమెరికాలో 100 కోట్ల డాలర్ల కం టే ఎక్కువ సంపద ఉన్న వలసదారుల జాబితాలో ఈ సంవత్సరం అత్యధికంగా భారత్‌కు చెందిన 12 మందికి చోటు దక్కింది. గతంలో ఎన్నడూ ఇంతమంది భారత వలసదారులు బిలియనీర్ల జాబితాలో చేరలేదని '2025 అమెరికా రిచెస్ట్ ఇమ్మిగ్రెంట్స్ లిస్ట్' పేరుతో ఫోర్బ్స్ మ్యాగజైన్ రూపొందించిన నివేదిక వెల్లడించింది. భారత్ తర్వాత ఇజ్రాయెల్, తైవాన్ దేశాలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. కాగా ఈ సంవత్సరం ఫోర్బ్స్ మ్యాగజైన్ ప్రకటించిన వలస బిలియనీర్ల జాబితాలో గూగుల్ మాతృసంస్థ అల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్, తెలుగువాడైన మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల కూడా ఉన్నారు. ప్రస్తుతం వీరిద్దరి ఆస్తుల విలువ చెరో 110 కోట్ల డాలర్ల (సుమారు రూ. 9,427 కోట్లు) వరకు ఉంటుందని ఫోర్బ్స్ పత్రిక అంచనా. సైబర్ సెక్యూరిటీ సంస్థ జెడ్‌స్కేలర్ వ్యవస్థాపకుడు, సీఈఓ జై చౌదరి ఈ విషయంలో 1,790 కోట్ల డాలర్ల (సుమారు రూ. 1.53 లక్షల కోట్లు) సంపదతో మిగతా భారత బిలియనీర్లు అందరి కంటే ముందున్నారు.

# టీసీఎస్ లాభం రూ.12,760 కోట్లు




న్యూఢిల్లీ/ముంబై: ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) గురువారం ప్రకటించిన తొలి త్రైమాసిక (ఏప్రిల్–జూన్) ఫలితాలు మార్కెట్ అంచనాలను అందు కోలేక పోయింది. ప్రధాన మార్కెట్లలో ఎదురీతతో పాటు గత కొన్ని త్రైమాసికాలుగా అండగా ఉన్న బీఎస్ఎన్ఎల్ డీల్‌ను రద్దు చేసుకున్న ప్రభావం ఫలితాలపై స్పష్టంగా కనిపించింది. నాన్ కోర్ ఆదాయాల వృద్ధి కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్ త్రైమాసికానికి కంపెనీ రూ. 12,760 కోట్ల లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం 6న వృద్ధి చెందింది. మరోవైపు ఈ కాలంలో కంపెనీ ఆదాయం రూపాయి మారకంలో 1.3న వృద్ధి చెంది రూ. 63,437 కోట్లుగా నమోదైనప్పటికీ స్థిర కరెన్సీ ఆదాయం మాత్రం 3న క్షీణించింది. ఇతరత్రా ఆదాయం గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే రూ. 962 కోట్ల నుంచి రూ. 1,660 కోట్లకు పెరిగింది. గతంలో చెల్లించిన ఆదాయపు పన్ను ఏకమొత్తంలో వాపసు రావడం కంపెనీ లాభాలకు దోహదపడింది. నిర్వహణాపరమైన లాభాల మార్జిన్ సైతం వార్షిక ప్రాతిపదికన 24.7న నుంచి 24.5 శాతానికి తగ్గింది. అమెరికాలో ఆదాయం 2.7న తగ్గడమే ఇందుకు కారణం. రూ. 15,000 కోట్ల విలువ గల బీఎస్ఎన్ఎల్ రద్దు ప్రభావం వల్ల భారత్ నుంచి సమకూరే ఆదాయాలు కూడా 21.7న తగ్గినట్టు ప్రకటించింది. అయితే బీఎస్ఎన్ఎల్ నుంచి రూ. 2,900 కోట్ల యాడ్ ఆన్ వర్క్ వచ్చిందని, ఆ పని ఇంకా ప్రారంభించాల్సి ఉందని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా స్థూల ఆర్థిక, భౌగోళిక, రాజకీయ విభాగాల్లో కొనసాగుతున్న అస్థిరతల కారణంగా ఐటీ సర్వీసులకు డిమాండ్ క్షీణించిందని, ఈ కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయాల్లో రెండంకెల వృద్ధి ఉంటుందని తాను భావించడంలేదని టీసీఎస్ ఎండీ, సీఈఓ కే కృతివాసన్ అన్నారు. ముందు త్రైమాసికంలో విధాన నిర్ణయాల్లో చోటు చేసుకున్న జాప్యం సైతం ఇప్పుడు మరింత తీవ్రమైందని ఆయన చెప్పారు. అయితే గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్ల ఆదాయాలు కొంత మెరుగ్గా ఉండవచ్చని తెలిపారు. ఒకసారి అస్థిరతలన్నీ తొలగిపోతే ఐటీ కంపెనీల ఆదాయాల వృద్ధికి ప్రధాన చోదకమైన విచక్షణాత్మక వ్యయాలు సాధారణ స్థాయికి వస్తాయన్నారు. ఆగస్టు చివరి నాటికి తమకు ప్రధాన మార్కెట్ అయిన అమెరికాతో వాణిజ్య ఒప్పందం తుదిరూపు దిద్దుకోవడం, క్లయింట్లు వ్యయ నియంత్రణ పాటిస్తున్న కొన్ని అంశాలపై స్పష్టత రావడం వంటి పరిణామాలు చోటు చేసుకోవచ్చని కృతివాసన్ తెలిపారు.

# చైనా మార్కెట్లోకి దక్కన్ రైస్



దక్కన్ బ్రాండ్ పేరుతో బియ్యం ఎగుమతి చేస్తున్న దక్కన్ గ్రెయిన్స్ ఇండియా తాజాగా చైనా మార్కెట్లోకి ప్రవేశించింది. కంపెనీ ఇప్పటికే అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, లండన్, స్వీడన్, జర్మనీ దేశాల్లో 30 రకాల బి య్యాన్ని విక్రయిస్తోంది. అమెరికా మార్కెట్లో బాస్మతియేతర బియ్యం విభాగంలో కంపెనీ ఇప్పటికే అగ్రస్థానంలో ఉందని దక్కన్ గ్రెయిన్స్ డైరెక్టర్ కిరణ్ కుమార్ పోలా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని రైతుల నుంచి బి య్యం కొనుగోలు చేసి ఎగుమతి చేస్తున్నట్లు చెప్పారు. కంపెనీ ప్రస్తుతం హైదరాబాద్ సమీపంలోని సుల్తాన్‌పూర్ వద్ద రైస్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను నిర్వహిస్తోంది.

# ఎల్ఐసీలో 1 శాతం వాటా విక్రయం




న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బీమా దిగ్గజం భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) మరోసారి వాటాల విక్రయానికి సిద్ధమవుతోంది. కంపెనీ ఈక్విటీలో 1 శాతం వాటాను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించినట్లు సమాచారం. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఈ ఓఎఫ్ఎస్ ద్వారా రూ. 5,850 కోట్ల వరకు సమకూరే అవకాశం ఉందని భావిస్తున్నారు. మార్కెట్ పరిస్థితుల ఆధారంగా ఈ వాటా విక్రయంపై పెట్టుబడుల ఉ పసంహరణ మంత్రిత్వ శాఖ దీనిపై నిర్ణయం తీసుకుంటుంది. ఎల్ఐసీ 2022 మే నెలలో తన ఈక్విటీలో 3.5 శాతం వాటాను ఐపీఓ ద్వారా విక్రయించి రూ. 21,000 కోట్లు సమీకరించింది. సెబీ నిబంధనల ప్రకారం కంపెనీ 2027 మే నాటికి తన ఈక్విటీలో కనీసం 10 శాతం అంటే మరో 6.5 శాతం వాటాను ప్రజలకు విక్రయించాలి. అయితే ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా.. మార్కెట్ పరిస్థితులను బట్టి దశల వారీగా విక్రయించాలని ఎల్ఐసీ యోచిస్తోంది. ఆ వ్యూహంలో భాగంగానే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1 శాతం ఈక్విటీ వాటా ను త్వరలో ఓఎఫ్ఎస్ ద్వారా విక్రయించాలని భావిస్తున్నట్టు సమాచారం. 2022 మే నెలలో రూ. 21,000 కోట్ల సమీకరణకు ఎల్ఐసీ రూ. 902–949 ధరల శ్రేణితో ఐపీఓకు వచ్చింది. ఇన్వెస్టర్లు ఆసక్తి చూపించడంతో ఇష్యూ దాదాపు మూడు రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. అయితే షేర్ల లిస్టింగ్ తొలి రోజే 8 శాతం నష్టంతో మదుపరులను తీవ్రంగా నిరాశ పరిచింది.

# జీఎంఆర్ లాజిస్టిక్స్ పార్క్‌లో జీహెచ్ఐఏఎల్‌కు 70 శాతం వాటా




ఈఎస్ఆర్ జీఎంఆర్ లాజిస్టిక్స్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్‌లో (ఈజీఎల్‌పీపీఎల్) 70 శాతం వాటాలు కొనుగోలు చేసినట్టు జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (జీహెచ్ఐఏఎల్) ప్రకటించింది. ఈ సంస్థలో జీహెచ్ఐఏఎల్ అనుబంధ సంస్థ జీఎంఆర్ హైదరాబాద్ ఏరోట్రోపోలిస్ లిమిటెడ్‌కు (జీహెచ్ఏఎల్) 30న వాటాలున్నాయి. హైదరాబాద్‌లో గిడ్డంగులు, లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటు కోసం 2020 జనవరి 8వ తేదీన జీహెచ్ఏఎల్, ఈఎస్ఆర్ హైదరాబాద్ 1 పీటీఈ లిమిటెడ్ భాగస్వామ్యంలో ఈజీఎల్‌పీపీఎల్ ఏర్పాటైంది.

# హెచ్‌యూఎల్ ఎండీ సీఈఓగా ప్రియా నాయర్



న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద ఎఫ్ఎంసీజీ కంపెనీ హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్)లో అధికార మార్పిడి జరగనుంది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి కంపెనీ ఎండీ, సీఈఓగా ప్రియా నాయర్ బా?ధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు కంపెనీ ఎండీ, సీఈఓగా ఉన్న రోహిత్ జావ ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో ప్రి యా నాయర్ బాధ్యతలు చేపడతారని హెచ్‌యూఎల్ ప్రకటించింది. ఒక మహిళను ఎండీ, సీఈఓ పదవిలో నియమించడం హెచ్‌యూఎల్ చరిత్రలో ఇదే మొదటిసారి. ఆమె ఈ పదవిలో ఐదేళ్ల పాటు కొనసాగుతారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006